దస్త్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి : జేసీ



తంబళ్లపల్లెలో నిర్మాణంలో ఉన్న గోదామును పరిశీలిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

పెద్దమండ్యం, తంబళ్లపల్లె, న్యూస్‌టుడే: రెవెన్యూ కార్యాలయాల్లో వర్షాలకు గదులు ఉరవడం, దస్త్రాలు తడవడం తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. పెద్దమండ్యం, తంబళ్లపల్లె మండలాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఫ్రీహోల్డ్ భూముల దస్త్రాలను పరిశీలించారు. అక్రమాలకు తావులేకుండా అర్హత ఉన్నవారిని గుర్తించి దస్త్రాలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డుల గదులను పరిశీలించి భద్రతపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యాలయంలో దస్త్రాలు తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తంబళ్లపల్లెలో నిర్మాణంలో ఉన్న గోదామును పరిశీలించి నిత్యావసర సరకుల నాణ్యతను పరిశీలించి సూచనలిచ్చారు. ఆయనవెంట తహసీల్దారు సయ్యద్ అహమ్మద్, జిల్లా పౌరసరఫరాలశాఖ మేనేజర్ శివరాం తదితరులున్నారు.

నవంబరు 10 నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ

రాయచోటి, న్యూస్‌టుడే : వైఎస్ఆర్ జిల్లా కడప డీఎస్ఏ స్టేడియంలో నవంబరు 10వ తేదీ నుంచి అగ్నివీర్ ఆర్మీ నియామక ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆర్మీ నియామక అధికారి కల్నల్ పునీత్‌కుమార్ తెలిపారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, కార్యాలయ సహాయకులు, స్టోర్ కీపర్ టెక్నికల్, ట్రేడ్మెన్‌ల నియామకానికి దరఖాస్తులు చేసుకుని అడ్మిట్ కార్డులు పొందిన కర్నూలు, నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్, గుంటూరు, ప్రకాశం, చిత్తూరు, నంద్యాల, బాపట్ల, పల్నాడు, తిరుపతి, అన్నమయ్య, శ్రీసత్యసాయి జిల్లాల్లో అర్హులైన అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, ఎవరూ దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

నగర పంచాయతీ ఎన్నికలు జరిగేలా చూడండి

అధికారులకు మంత్రి నారాయణ దిశానిర్దేశం

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట నగర పంచాయతీ పాలకవర్గ ఎన్నికల నిర్వహణకు న్యాయపరమైన ఇబ్బందులను వీలైనంత త్వరగా తొలగించాలని పురపాలకశాఖ మంత్రి నారాయణ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు ఇటీవల స్థానిక సంస్థలపై అమరావతిలోని పురపాలకశాఖ డీఎంఏ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రి సంకేతాలిచ్చారు. మేజర్ పంచాయతీ నుంచి నగర పంచాయతీ స్థాయిని పెంచుకున్న బి.కొత్తకోటకు ఎన్నికలు ఇప్పటి వరకు నిర్వహించలేదన్న విషయం మంత్రి దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఎన్నికలు జరగకపోవడంతో నగర పంచాయతీకి కేంద్రం నుంచి ఆర్థిక సంఘం నిధులు కేటాయించని విషయాన్ని గుర్తు చేశారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ ఎన్నికలకు అడ్డంకిగా ఉన్న కోర్టు కేసులను అధ్యయనం చేసి ప్రభుత్వవాదనను సమర్థంగా వినిపించాలన్నారు. రహదారులు, మురుగు కాలువలు, కుళాయిల ఏర్పాటుతో పాటు వివిధ పనులకు నగర పంచాయతీ వద్ద నిధుల్లేవని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. కనీస వసతులను మెరుగుపర్చడానికి అవసరమైన పనులను గుర్తించి ప్రతిపాదనలను పంపాలని, నిధుల కేటాయింపు విషయాన్ని తాను చూసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. నగర పంచాయతీలో అధికారులతో పాటు ఉద్యోగులు డిప్యూటేషన్లపై పని చేస్తున్నారని, శాశ్వత నియామకాలు చేపట్టడానికి చర్యలు తీసుకుంటానని మంత్రి పేర్కొన్నారు. నగర పంచాయతీ స్థితిగతులపై నగర పంచాయతీ కమిషనరు పల్లవి, మేనేజర్ రమాదేవి డీఎంఏకు సమగ్ర నివేదిక సమర్పించారు.

భూసమస్యల పరిష్కారానికి గ్రామసభలు

రాయచోటి, న్యూస్‌టుడే : జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న భూసమస్యల పరిష్కారానికి ఈ నెల 30వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు జేసీ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. రీసర్వే గ్రామాల్లో భూ సమస్యలున్నట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. తహసీల్దార్లు, డీటీలు, మండల సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ సర్వేయర్‌తో కూడిన అధికారుల బృందం ప్రజల నుంచి వచ్చిన అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. నిర్ణీత గడువులోగా సమస్యను పరిష్కరించాలని సూచించారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతులు సభలకు హాజరై సమస్యలను అర్జీల ద్వారా అధికారులకు విన్నవించాలని సూచించారు.

కాలువ తవ్వేసి... వంతెన వదిలేసి!

- జలవనరులశాఖ అధికారుల బాధ్యతారాహిత్యం
- గత అయిదేళ్లుగా 40 గ్రామాల ప్రజలకు పాట్లు
- చిన్నమండెం-దేవపట్ల ప్రధాన రహదారి దుస్థితి

జలవనరులశాఖ ఇంజినీరింగ్ అధికారుల బాధ్యతారాహిత్యానికి గత అయిదేళ్లుగా 40 గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కనీస అవగాహన లేకుండా ఇష్టారాజ్యంగా రహదారి తవ్వేశారు. ఆపై లక్ష్యమైనా నెరవేరిందంటే అదీ లేదు. అటు పథకం పూర్తిచేయక... తవ్వేసిన ప్రాంతంలో కాలువపై వంతెన నిర్మించకుండా ఏళ్లుగా కాలయాపన చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ప్రయాణికుల కష్టాలు తీర్చాల్సిన ప్రజాప్రతినిధులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఇలాంటి దౌర్భాగ్యకరమైన పరిస్థితిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధ్యతారాహిత్యంగా పని చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.



చిన్నమండెం-దేవపట్ల ప్రధాన రోడ్డులో కుమ్మరపల్లె వద్ద హంద్రీనీవా కాలువ నిర్మాణానికి తవ్వేసిన రోడ్డు

–ఈనాడు, కడప, న్యూస్‌టుడే, చిన్నమండెం

ఏమాత్రం అవగాహన.. బాధ్యత ఉన్నా హంద్రీ-నీవా కాలువ తవ్వే సమయంలో రహదారి వరకు వదిలిపెట్టి పనులు చేపట్టాల్సి ఉంది. ఈ మాత్రం జాగ్రత్తలు తీసుకోకపోవడంతో చిన్నమండెం- దేవపట్ల ప్రధాన రహదారి మూతపడిపోయింది. హంద్రీ- నీవా సుజల స్రవంతి పథకం కింద అడవిపల్లి జలాశయానికి నీటిని తీసుకెళ్లేందుకు కుమ్మరపల్లె వద్ద రహదారిని తవ్వేశారు. రహదారి తవ్వకం పనులు పూర్తి కాగానే వంతెన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. లేని పక్షంలో రహదారి వరకు కాలువ తవ్వకం వదిలిపెట్టి అవసరమైన సమయంలో తవ్వకం చేపట్టాల్సి ఉంది. ఇవన్నీ పట్టించుకోకుండా ఇష్టారాజ్యంగా గుత్తేదారు రహదారి తవ్వేసి కొంత వరకు కాలువ పనులు చేపట్టి.. బిల్లులు రాకపోవడంతో వదిలిపెట్టి వెళ్లిపోయారు. దీంతో గత అయిదేళ్లుగా ప్రయాణికుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా చిన్నమండెం, సంబేపల్లె మండలాల ప్రజలు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు- చిత్తూరు, రాయచోటి- మదనపల్లె జాతీయ రహదారులను కలిపేలా అనుసంధానంగా రహదారి ఉండేది. 2019లో రహదారి ఉన్న ప్రాంతంలో కాలువ తవ్వేశారు. కాలువ అంచున ఉండే మట్టిదారినే ప్రత్యామ్నాయంగా చూపారు. ఒకటిన్నర కిలోమీటరు దూరం ఉన్న ఈ మార్గం అధ్వానంగా తయారవ్వడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు, ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. రెండు మండలాలకు చెందిన సుమారు 40 గ్రామాల ప్రజల రాకపోకలకు వంతెన నిర్మించకపోవడంతో ఇబ్బందిగా మారింది. చిన్నమండెం, దేవపట్ల ప్రాంతాల నుంచి ప్రజలు అటు బెంగళూరు, ఇటు తిరుపతి పోవాలంటే రాయచోటికి వెళ్లాల్సి వస్తోంది. అదే వంతెన నిర్మాణమైతే 30 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.




పక్కనున్న రహదారిపై వాహనదారుల అవస్థలు

త్వరలోనే సమస్యకు పరిష్కారం



చిన్నమండెం-సంబేపల్లె మార్గంలో హంద్రీ-నీవా కాలువ వద్ద రహదారి తవ్వేయడంలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించాం. త్వరలోనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇంజినీరింగ్ అధికారులతో చర్చించాం. ప్రతిపాదనలు తయారు చేసి కాలువపై వంతెన నిర్మాణం చేపడతాం. **-మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, రవాణా, యువజన, క్రీడలశాఖ మంత్రి**

రాకపోకలకు ఇబ్బందిగా ఉంది -నాగభూషణం, కుమ్మరపల్లె



మా మామిడి తోటలు, పంట పొలాలు తవ్వేసిన రహదారికి అవతలి వైపు ఉన్నాయి. దీంతో రోజూ పొలానికి వెళ్లాలంటే రెండు కిలోమీటర్ల దూరం చుట్టి రావాల్సి వస్తోంది. ఆరోగ్యం సరిగా లేకపోవడంతో నడవాలన్నా ఇబ్బందిగా ఉంది. అప్పట్లో త్వరగా వంతెన నిర్మిస్తామంటూ రహదారి తవ్వేశారు. పాలకులు పట్టించుకుని త్వరగా సమస్యను పరిష్కరించాలి.

వర్షాకాలంలో తప్పని అవస్థలు -వై.నాగిరెడ్డి, సి.పొలిమేరపల్లె



రెండు మండలాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో ప్రత్యామ్నాయ రోడ్డులో ప్రయాణించలేక అవస్థలు పడుతున్నాం. అయిదేళ్లవుతున్నా పాలకులు పట్టించుకోలేదు. కొత్త ప్రభుత్వంలోలైనా సమస్య పరిష్కారమవుతుందని భావిస్తున్నాం.

ఎన్డీయే ప్రభుత్వంపైనే ఆశలు -శివ, చిన్నమండెం



పాఠశాలలకు వెళ్లి రావాలన్నా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కనీస పరిజ్ఞానం లేకుండా ఇంజినీర్లు పనులు చేపట్టారు. వంతెన లేక ఇబ్బంది పడుతున్నాం. ఎన్డీయే ప్రభుత్వంపైనే ప్రజలు ఆశలు పెట్టుకున్నాం. త్వరగా వంతెన నిర్మాణానికి చొరవ తీసుకుంటారని ఆశిస్తున్నాం.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థుల దుర్మరణం





అజయ్‌కుమార్‌రెడ్డి, యశ్వంత్‌కుమార్‌రెడ్డి (పాత చిత్రాలు)

దాదంవారిపల్లె (కురబలకోట) : మండలంలోని దాదంవారిపల్లె పంచాయతీకి సమీపంలోని పరదేశిపల్లె వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీలోని మలిగివారిపల్లెకు చెందిన సుబ్బారెడ్డి, శ్రీదేవిల ఏకైక కుమారుడు అజయ్‌కుమార్‌రెడ్డి (20), ఇదే పంచాయతీ చెట్లవారిపల్లెకు చెందిన వెంకటరెడ్డి, సావిత్రమ్మల ఏకైక కుమారుడైన యశ్వంత్‌కుమార్‌రెడ్డి (20), మదనపల్లెలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో డిగ్రీ రెండో ఏడాది చదువుతున్నారు. కళాశాలలో తరగతులు ముగించుకుని, శుక్రవారం సాయంత్రం 5 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై, దాదంవారిపల్లెకు సమీపంలోని బందార్లపల్లె వద్ద ఇంటికి వెళ్తుండగా, మదనపల్లె 1వ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు తంబళ్లపల్లె నుంచి మదనపల్లె వైపు వస్తూ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఘటన జరగ్గానే సమీపంలోని స్థానికులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. ఘటనపై సమాచారాన్ని స్థానికులు ముదివేడు పోలీసులకు అందించగా, అక్కడికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. యువకుల మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి శవపరీక్ష నిమిత్తం తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



ప్రమాద స్థలంలో బస్సు, దెబ్బతిన్న ద్విచక్ర వాహనం

పోలీసు అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాం: ఎస్పీ



అమరవీరుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు పేర్కొన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఆయన విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కుటుంబ సభ్యులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యక్తిగత, ఇతర సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వ పరంగా అందుతున్న సౌకర్యాలు, కుటుంబ స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. ఏవైనా సమస్యలుంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తామని తెలిపారు. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు, హోంగార్డ్స్, సిబ్బంది వ్యక్తిగత, కుటుంబ, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు సిబ్బంది పలు సమస్యలను ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో డీఎస్పీ చిన్నికృష్ణ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలుపుతున్న ఒప్పంద అధ్యాపకులు

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

రాయచోటి, న్యూస్‌టుడే: ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శుక్రవారం పసుపు రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. గతంలో ఎన్నికల కోడ్‌తో ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించే ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. జీవో 114ను అమలు చేసి క్రమబద్ధీకరణ ప్రక్రియను త్వరగా ప్రారంభించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారంతా డిమాండు చేశారు.

'నాబార్డు' పనులు వేగవంతం చేయండి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే: మంజూరైన పనుల్లో ఆలస్యం లేకుండా, వేగవంతంగా పూర్తి చేయాలని నాబార్డు డీజీఎం దినిపనీకర్ అన్నారు. హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చిన ఆమె శుక్రవారం కడపలో రాయలసీమ, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలకు చెందిన పలు శాఖల అధికారులు, ఇంజినీర్లతో వర్క్‌షాపు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాబార్డు నుంచి అనేక ప్రభుత్వ శాఖలకు మంజూరైన పనులను ఆయా అధికారులు నిబంధనల ప్రకారం చేయించాలన్నారు. ఏ చిన్న తేడా వచ్చినా పలు సమస్యలు వస్తాయని హెచ్చరించారు. నాణ్యతలో రాజీపడొద్దని హెచ్చరించారు. నాబార్డు ఆర్ఐడీఎఫ్ కింద ఇచ్చిన నిధులు, వాటికి సంబంధించిన పనులు ఏ దశలో ఉన్నాయి, ఎన్ని పూర్తయ్యాయి, వాటికి బిల్లులు ఎందరు పంపారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాబార్డు ఏజీఎంలు అరుణ్, విజయవిహారి, వివిధ శాఖల అధికారులు, ఇంజినీర్లు, తదితరులు పాల్గొన్నారు.

మా వాళ్లకే ఇవ్వాలి!

- పశుసంవర్ధకశాఖ అధికారులపై నాయకుల ఒత్తిడి
- జిల్లాకు 1,200 గోకుల షెడ్ల యూనిట్ల మంజూరు

జిల్లాలో గోకులం షెడ్ల నిర్మాణానికి భారీ సంఖ్యలో దరఖాస్తులొచ్చాయి. జిల్లాకు కేటాయించిన షెడ్ల కంటే రెండింతలు దరఖాస్తులొచ్చినట్లు సమాచారం. వీటి మంజూరుకు రాజకీయ నాయకుల నుంచి పశుసంవర్ధకశాఖ అధికారులపై ఒత్తిళ్లు వస్తున్నాయి. తాము సిఫార్సు చేసిన వారికి మంజూరు చేయాలని హుకుం జారీ చేస్తుండడంతో ఏం చేయాలో తెలియక అధికారులు తల పట్టుకుంటున్నారు. సామాన్య పాడి రైతులకు షెడ్లు మంజూరయ్యే పరిస్థితి కనిపించడంలేదని ఆరోపణలొస్తున్నాయి.



రాయచోటి మండలం ఏపిలవంకపల్లెలో గత తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోకులం షెడ్డు

–న్యూస్‌టుడే, రాయచోటి గ్రామీణ

పాడి పరిశ్రమపై ఆధారపడిన రైతులను ఆదుకునేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం గోకులం పథకం కింద మినీ షెడ్ల నిర్మాణం చేపట్టింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం పథకాన్ని అటకెక్కించింది. ఒక్క రూపాయి కూడా విడుదల్లేదు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోకులం పథకం పునరుద్ధరణకు చర్యలు చేపట్టింది. గతంలో మాదిరిగానే పశు పోషకులకు 90 శాతం, జీవాలు, కోళ్ల పెంపకదారులకు 70 శాతం రాయతీపై షెడ్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాకు 1,200 యూనిట్ల మినీ గోకులం షెడ్లు కేటాయించగా, వీటిని తమ వాళ్లకే ఇవ్వాలని నాయకులు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీంతో అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అర్హులకు మంజూరు చేస్తాం

జిల్లాకు మంజూరైన గోకులం షెడ్ల కంటే ఎక్కువ దరఖాస్తులొచ్చాయి. ఎవరు ఎంత ఒత్తిడి తెచ్చినా మార్గదర్శకాలను అనుసరించి అర్హులైన వారికి మాత్రమే మంజూరు చేస్తాం. రెండో విడతలో మరికొన్ని షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే అవకాశం ఉంది. **- గుణశేఖర్ పిళ్లై, జేడీ. పశుసంవర్ధకశాఖ**

గోకుల షెడ్ల యూనిట్ల ధరలు (రూ.లలో)

పశువులు	యూనిట్ ధర	ప్రభుత్వ రాయితీ	రైతు వాటా
రెండు	1,15,000	1,03,500	11,500
నాలుగు	1,85,000	1,66,500	18,500
ఆరుకుపైగా	2,30,000	2,07,500	22,500

గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల ధరలు (రూ.ల్లో)

జీవాలు	యూనిట్ ధర	ప్రభుత్వ రాయితీ	పెంపకదారుల వాటా
20 జీవాల	1,30,000	91,000	39,000
50 జీవాలు	2,30,000	1,61,000	69,000
100 కోళ్లు	87,000	60,900	26,100
200 కోళ్లకు	1,32,000	92,400	39,600

హార్సిలీహిల్స్ టోల్‌గేటు ధరల పెంపు అమల్లోకి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: ప్రముఖ పర్యాటక కేంద్రమైన బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ టోల్‌గేటు నిర్వహణ బాధ్యతలు రెవెన్యూశాఖ నుంచి ప్రైవేటు గుత్తేదారుని చేతుల్లోకి వెళ్లాయి. కొత్తగా పెంచిన వాహనాల ప్రవేశ రుసుం ధరలు శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త ధరల ప్రకారమే ప్రవేశ రుసుం వసూళ్లకు గుత్తేదారు శ్రీకారం చుట్టారు. హార్సిలీహిల్స్ ఘాట్‌రోడ్డు ప్రారంభమయ్యే కాండ్లమడుగు క్రాస్ వద్ద తనిఖీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి కొండపైకి వెళ్లే వాహనాల నుంచి ప్రవేశ రుసుం కొన్నేళ్లుగా వసూలు చేస్తున్న విషయం తెలిసిందే. మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ ఆదేశాల మేరకు ఇప్పటి వరకు ద్విచక్ర వాహనానికి రూ.30 తీసుకుంటుండగా, దీన్ని రూ.50కి పెంచారు. బస్సుకు రూ.170 నుంచి రూ.200 వసూలు చేయాలని నిర్ణయించారు. గతంలో మాదిరిగానే ఆటోలకు రూ.70, కార్లకు రూ.100 చొప్పున వసూలు చేయనున్నారు. వసూళ్ల బాధ్యతను గుత్తేదారునికి అప్పగించడానికి గత నెల 30న మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. పెంచిన ధరలతో వసూళ్లకు అనుమతి రావడంతో టోల్‌గేటు రూ.45.20 లక్షలకు ఓ గుత్తేదారు అత్యధికంగా ధర పాడుకున్నారు. గతేడాది రూ.27.30 లక్షలు పలికిన ధర ఈ సారి భారీగా పెరిగిపోయింది. ఈ నెల ఒకటోతేదీ నుంచి గుత్తేదారు టోల్‌గేటులో పెరిగిన ధరల ప్రకారం వసూళ్లను ప్రారంభించాల్సి ఉంది. గుత్తేదారు అడ్వాన్సును టౌన్‌షిప్ కమిటీకి చెల్లించకపోవడంతో గత 18 రోజులుగా రెవెన్యూ సిబ్బంది వసూళ్ల బాధ్యతను నిర్వర్తించారు. తాజాగా గుత్తేదారు అడ్వాన్సు చెల్లించి టోల్‌గేటు బాధ్యతలు తీసుకున్నారు. టౌన్‌షిప్ కమిటీ ఖరారు చేసిన ధరల ప్రకారమే వాహనచోదకుల నుంచి ప్రవేశ రుసుం వసూలు చేయాలని అధికార వర్గాలు స్పష్టం చేశాయి.

పాలకొండల్లో జలసోయగం



జిల్లాలో గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వీరబల్లి మండలం గురప్పగారిపల్లి పంచాయతీ పాలెంపాలెం సమీపంలోని పాలకొండల నుంచి భారీఎత్తున వరద నీరు జాలువారుతోంది. ఇది జలపాతాన్ని తలపిస్తుండడంతో స్థానికులను ఆకట్టుకుంటోంది. **- న్యూస్‌టుడే, వీరబల్లి**

దానిమ్మ రైతులకు తుపాను దెబ్బ!

- తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు, పీటీఎం, తంబళ్లపల్లె, బి.కొత్తకోట, కురబలకోట మండలాల్లో వెయ్యి ఎకరాల్లో బగువా, రూబి, కేడిల్లా, గణేష్, మృదుల రకాల దానిమ్మ తోటలు సాగు చేశారు. ఎకరా సాగుకు సుమారు రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. దిగుబడి, ధరలు ఆశాజనకంగా ఉండడంతో రైతుల ఆనందానికి అవధుల్లేకుండాపోయాయి. గత నాలుగు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో రైతుల ఆశలు అడియాశలయ్యాయి. ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు ఆదాయం పొందే రైతులు భారీ వర్షాల ధాటికి కాయలు నేలరాలడం, ఊజీ తెగులు సోకడంతో నష్టాలు చవిచూడాల్సిన వచ్చింది.

–న్యూస్‌టుడే, ములకలచెరువు, పెద్దతిప్పసముద్రం

కరవు నేలలో సిరుల పంటగా రైతులను ఆదుకుంటున్న దానిమ్మ తోటలు తుపాను దెబ్బకు కకావికలమయ్యాయి. భారీ వర్షాలతో కోతకొచ్చిన కాయలు రాలిపోవడంతో పాటు తెగుళ్ల బారిన పడి రైతులు తీవ్రంగా నష్టపోయారు. జిల్లాలో తంబళ్లపల్లె నియోజకవర్గం దానిమ్మ తోటల సాగుకు పెట్టింది పేరు. ఇక్కడ వాతావరణం అనుకూలిస్తుండడంతో వేల ఎకరాల్లో సాగవుతోంది. రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు చాలా మంది రైతులు దానిమ్మ తోటలను తొలగించడంతో సాగు విస్తీర్ణం వందల ఎకరాలకు పడిపోయింది. తాజాగా తుపాను ధాటికి రైతులు విలవిలలాడుతున్నారు.



భారీ వర్షాలకు తెగుళ్ల బారిన పడిన దానిమ్మ తోట

నష్టం వివరాలివి	తోట	సాగు	రకాలు	నష్టం	మొత్తం
	దానిమ్మ	1,000 ఎకరాలు	బగువా, రూబి, కేడిల్లా, గణేష్, మృదుల	ఎకరాకు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలు	రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్లు

- రాలిన కాయలు, ఆపై తెగుళ్లు
- రూ.కోట్లలో వాటిల్లిన నష్టం

రూ.15 లక్షల నష్టం -మధుసూదన్, ములకలచెరువు



పదెకరాల్లో దానిమ్మ సాగు చేశాను. పంట కోతదశకు వచ్చే సమయానికి భారీ వర్షాలు కురవడంతో పూర్తిగా దెబ్బతింది. సుమారు రూ.15 లక్షల వరకు నష్టం వచ్చింది. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

నేలపాలైంది - కట్టా సురేంద్రనాయుడు, కమ్మవారిపల్లి



దిల్లీ వ్యాపారులు కాయలు నాణ్యతను చూసి రూ.20 లక్షలకు మాట్లాడారు. కోత మొదలుపెడదామనుకున్న తరుణంలో తుపానుతో నాణ్యత తగ్గడంతో వెనక్కి వెళ్లిపోయారు. పంట చేతికందే సమయంలో అపారనష్టం వాటిల్లింది.

జాగ్రత్తలు తీసుకోవాలి

వర్షాలకు దానిమ్మ తోటలు తెగుళ్ల బారిన పడకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం తగ్గిన తరువాత బిల్‌టాక్స్, సీవోసీ మందులను పిచికారీ చేస్తే తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవచ్చు. నష్టం వివరాలను అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- భీమేష్, ఉద్యానవనశాఖాధికారి, ములకలచెరువు

నాణ్యత వెలుస్తోంది... ఏడాదికే గది ఉరుస్తోంది

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పీలేరు పంచాయతీ కార్యాలయం పైకప్పు నుంచి వర్షపు నీరు కారి దిగువన ఉన్న సమావేశపు గది ఫ్లోరింగ్‌పై నిలిచింది. కార్యాలయం పైఅంతస్తులో గదులను ఏడాది కిందట రూ.25 లక్షలతో నిర్మించారు. చిన్నపాటి వర్షాలకు భవనం కారుతుండడంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు చూసి విస్తుపోతున్నారు. కార్యాలయంలోని పైఅంతస్తులో ఉన్న ఇతర గదుల్లో కూడా వర్షపునీరు నిలిచింది. దీనిపై పంచాయతీ కార్యాలయం కార్యదర్శి గురుమోహన్‌ను వివరణ కోరగా భవనం నూతనంగా నిర్మించినందున గొట్టాలు కొంత లీకేజీ అవుతున్నట్లు గుర్తించామని గుత్తేదారునికి చెప్పి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.

- న్యూస్‌టుడే, పీలేరు



పంచాయతీ సమావేశపు గదిలో నిలిచిన నీరు

భూసంరక్షణ... నిధుల్లేక నిస్సారం

ఉమ్మడి కడప జిల్లాలో దయనీయ పరిస్థితి

-న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం, కలసపాడు, ఎర్రగుంట్ల

సాగుకు ప్రధానమైనవి మట్టి, నీరు. సారవంతమైన, పోషకాలతో కూడిన భూములను సంరక్షించుకోవడంతో పాటు నీటి పారుదలతోనే పంటల దిగుబడిని పెంపొందించుకునేందుకు వీలుగా ఏర్పాటైన భూసంరక్షణ విభాగం ఉమ్మడి కడప జిల్లాలో నిర్వీర్యమైంది. సాగుకు అనుబంధంగా ఉన్న పశుపోషణ, కోళ్ల పెంపకాలతోనే రైతుల ఆదాయాలను మరింత రెట్టింపు చేసేందుకు అనువుగా ఉన్న ఈ విభాగం కరవు ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా మారింది. వ్యవసాయశాఖకు అనుబంధంగా ఉన్న ఈ విభాగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించాల్సిన నిధులు ఐదేళ్ల నుంచి ఒక్కపైసా కూడా మంజూరు కాలేదు.

రైతులకు ప్రయోజనం

రైతుల అభివృద్ధికి దోహదపడే ఈ విభాగానికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను కేటాయిస్తోంది. ఈ నిధులతో దుర్భిక్ష ప్రాంతాభివృద్ధి పథకం (ఆర్‌డీపీ) 50 శాతం రాయితీతో ఎంపిక చేసిన క్లస్టర్ గ్రామాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగుకు, నీటి సరఫరా గొట్టాల ఏర్పాటు, వాటర్‌షెడ్‌ల సంరక్షణ ఆయిల్ ఇంజిన్లు, గొర్రె పిల్లల పెంపకం, పంటకోత అనంతర నిల్వ కేంద్రాల నిర్మాణానికి వ్యయం చేస్తారు. ప్రధాన మంత్రి కృషి సించయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద రైతుల పంట పొలాల్లో 50 శాతం రాయితీతో వ్యక్తిగత ఫారమ్ పాండ్ నిర్మాణాలు వంద శాతం రాయితీతో సామూహిక నీటికుంటలు నిర్మించవచ్చు. ఉమ్మడి కడప జిల్లాలో 2016-17 ఆర్థిక సంవత్సరంలో రైతులకు 50 శాతం రాయితీతో నీటి సరఫరా గొట్టాలను, ఆయిల్ ఇంజిన్లను అందజేశారు. చిన్న కమతాల రైతులకు నీటిసంరక్షణ నిమిత్తం ఎండిపోయిన బోర్ల పునరుద్ధరణ, భూగర్భ జల మట్టాల పెంపునకు నీటి కుంటల నిర్మాణార్థం నిధులు కేటాయించారు. వాగులకు గట్లువేయడం, చెరువుల్లో పూడిక తొలగించి వాటిని పొలాలకు మళ్లించడం, పంటలకు అనుబంధంగా పశుపోషణను పెంపొందించడంపై రైతులకు రాయితీతో నిధులను కేటాయిస్తోంది.

సిబ్బంది ఇతర విభాగాలకు బదిలీ

ఉమ్మడి కడప జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, కడప, బద్వేలు సబ్ డివిజన్ల పరిధిలో భూ సంరక్షణ కార్యాలయాలు ఉన్నాయి. ఒక్కో సబ్ డివిజన్‌కు 12 మండలాల దాకా ఉన్నాయి. సబ్ డివిజన్‌కు ఒక ఏడీఏ, ఇద్దరు ఏవోలను కేటాయించారు. ఈ విభాగానికి నిధులు రాకపోవడంతో చాలా సబ్ డివిజన్లలో సిబ్బంది వ్యవసాయ శాఖలో ఇతర విభాగాలకు డిప్యూటేషన్‌తో పాటు బదిలీపై వెళ్లారు. జిల్లా స్థాయి డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ (డీడీఏ) అధికారి లేరు. 2019 నుంచి ఉమ్మడి జిల్లాకు నిధులు ఒక్క పైసా రాలేదు. దీంతో నిధులు లేకపోవడంతో తీవ్ర కరవు ప్రాంతాల్లో భూ, నీటి సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టలేక మిన్నకుండిపోయారు.



కలసపాడు మండలం పాతరామాపురంలో నిర్మించిన నీటికుంట

సేవల మెరుగుకు చర్యలు

భూసార సంరక్షణ విభాగానికి ఐదేళ్ల నుంచి ఒక్క పైసా నిధులు కూడా రాలేదనడం వాస్తవమే. వ్యవసాయ అనుబంధ పనులు మెరుగుపరచుకునేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం. ఇక్కడి ఇబ్బందులను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-నాగేశ్వరరావు, వైఎస్సార్ జిల్లా వ్యవసాయాధికారి

ఉత్తీర్ణతలో ఆదర్శంగా నిలవాలి: డీఈవో

కలకడ, న్యూస్‌టుడే : ఆదర్శ పాఠశాల, కళాశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణతను సాధించడానికి ఉపాధ్యాయులు, అధ్యాపకులు కృషి చేయాలని డీఈవో శివప్రకాశ్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకుంటూ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులందరూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఉపాధ్యాయులు కూడా సమయపాలన పాటించాలని పేర్కొన్నారు. పీఎంశ్రీ పథకంలో మంజూరైన నిధులతో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని తెలిపారు. విద్యార్థుల వసతి గృహం ఆగిపోవడంపై ఆయన స్పందిస్తూ పూర్తి చేయడానికి ఉన్నతాధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ కోట రమేష్‌నాయుడు మధ్యాహ్న భోజనానికి విద్యార్థులకు రోజూ 20 లీటర్ల పెరుగు అందిస్తుండటంతో ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో మునీంద్ర నాయక్, ఎంఈవో-2 రామచంద్రారెడ్డి, ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శివప్రకాశ్‌రెడ్డి

ధ్రువపత్రాల పరిశీలన నేడు

రాయచోటి, న్యూస్‌టుడే: జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలలో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర సిబ్బంది నియామకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ధ్రువపత్రాలు శనివారం పరిశీలిస్తామని డీఈవో శివప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక్కో పోస్టుకు సంబంధించి అయిదుగురు అభ్యర్థుల చొప్పున ధ్రువపత్రాలు పరిశీలిస్తామన్నారు. రాయచోటిలోని డైట్ కేంద్రంలో జరిగే పరిశీలన కార్యక్రమానికి అభ్యర్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

ఇళ్ల నిర్మాణాల వేగవంతానికి చర్యలు

రాయచోటి, న్యూస్‌టుడే: ఇసుక లభ్యత అందుబాటులోకి రావడంతో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేస్తామని గృహ నిర్మాణ శాఖ జిల్లా అధికారి శివయ్య పేర్కొన్నారు. పక్కా గృహాల నిర్మాణానికి ఉచితంగా ఇసుకను ట్రాక్టర్లలో తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక అవసరాలకు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లలో ఇసుకను ఉచితంగా తీసుకెళ్లే వసతి కల్పించారు. జిల్లాలో 73 వేల గృహ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని, వంద రోజులలో ప్రభుత్వం నిర్ణయించిన లక్ష్యం ప్రకారం నిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి

ములకలచెరువు, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన ములకలచెరువులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... ములకలచెరువు మండలం, సోంపాళ్యం పంచాయతీ, గట్టుకిందపల్లికి చెందిన శంకరప్ప (54) సొంత పనుల నిమిత్తం శుక్రవారం ములకలచెరువుకు వచ్చాడు. రైల్వేస్టేషన్‌లో నుంచి రహదారిపైకి వచ్చిన శంకరప్పను కదిరి నుంచి మదనపల్లె వైపు వెళ్తున్న ఆర్టీసీ ఢీ కొంది. ఈ ప్రమాదంలో శంకరప్ప తీవ్రంగా గాయపడడంతో స్థానికులు గమనించి 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. శంకరప్ప మృతితో కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

కేసు నమోదు చేసిన పోలీసులు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: భార్య కాపురానికి రాలేదని మనస్తాపానికి గురైన భర్త నాగరాజు (62) ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటనపై కేసు నమోదు చేసినట్లు బి.కొత్తకోట ఏఎస్ఐ బొజ్జా నాయక్ శుక్రవారం తెలిపారు. బి.కొత్తకోట మండలం గుడిపల్లె సమీపంలో చెట్టుకు నాగరాజు గురువారం ఉరి వేసుకుని చనిపోయాడు. వాల్మీకిపురంలోని నమాజుకట్ట వీధికి చెందిన నాగరాజు సంచార జీవనం గడుపుతున్నాడు. ఈ క్రమంలో బీరంగికి చేరుకుని కూలి పనులతో జీవనం సాగిస్తున్నారు. మొదటి భార్య చనిపోవడంతో రెండో పెళ్లి చేసుకుని కాపురం చేస్తున్నాడు. ఈయనకు ఆరుగురు పిల్లలున్నారు. ఇంటి నుంచి రెండో భార్య అలిగి వెళ్లిపోయి నెలరోజులైనా తిరిగి రాలేదు. ఒంటరిగా జీవనం సాగిస్తున్న నాగరాజు మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహానికి మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం శవ పంచనామా నిర్వహించారు. మృతుడి కుమారుడు ఈశ్వరప్ప ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామని ఏఎస్ఐ వివరించారు.

చోరీ కేసులో నిందితులకు జైలుశిక్ష

కలకడ, న్యూస్‌టుడే : ద్విచక్ర వాహనం చోరీ కేసులో నిందితులకు వాల్మీకిపురం కోర్టులో న్యాయమూర్తి గురు అరవింద్ జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్.ఐ. రామాంజినేయులు శుక్రవారం సాయంత్రం తెలిపారు. ఎస్.ఐ. కథనం మేరకు మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఎర్రయ్యగారిపల్లె వద్ద 2023 డిసెంబరులో సంబేపల్లెకు చెందిన రెడ్డిప్రసాద్‌కు చెందిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ మేరకు అప్పటి ఎస్.ఐ తిప్పేస్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులు గుర్రంకొండ మండల చెర్లోపల్లెకు చెందిన చెన్నూరు ప్రకాశ్, నెల్లూరు జిల్లా నవాబుపేటకు చెందిన సుబ్బారెడ్డిలను అరెస్టు చేశారు. కేసును ఏపీపీ శంకర వాదించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శుక్రవారం ఒక్కొక్కరికి 15 నెలలు జైలుశిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పినట్లు ఎస్.ఐ పేర్కొన్నారు.

వైద్య కళాశాలను నిర్మించి తరగతులు ప్రారంభించాలి



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతంకుమార్, పక్కన నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : వైద్య కళాశాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి జాతీయ వైద్య కమిషన్ నుంచి అనుమతి పొంది వచ్చే సంవత్సరం నుంచి తరగతులను ప్రారంభించాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతంకుమార్ అన్నారు. శుక్రవారం సొసైటీ కాలనీలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైద్య కళాశాలలకు సంబంధించిన కౌన్సెలింగ్‌లో మదనపల్లె కళాశాలను ఆప్షన్‌గా చూపించకపోవడం కళాశాలను రద్దు చేసే కుట్రలో భాగమేనన్నారు. ఒక్క మదనపల్లె మినహా మిగిలిన కళాశాలల నిర్మాణ పనులు పూర్తయి తరగతులు ప్రారంభించి, రెండో సంవత్సరంలోకి అడుగుపెడుతున్నాయని తెలిపారు. గత సంవత్సరం జరిగిన కౌన్సెలింగ్‌లో మదనపల్లె వైద్య కళాశాలకు ప్రొఫెసర్లు, స్టాఫ్ నర్సులు కేటాయింపులు చేశారని తెలిపారు. ప్రస్తుతం వీరందరూ బదిలీలు పెట్టుకుని బయటకు వెళ్లిపోవడం జరుగుతుందన్నారు. వచ్చే సంవత్సరం నుంచి మెడికల్ కళాశాలలో తరగతులను ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు రమణ, ఉదయ్, గంగాధర్, లక్ష్మీపతి, సంధ్య, శివప్రసాద్, మహేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించే వరకు పోరాటం



మాట్లాడుతున్న వాల్మీకి మహాసేన నాయకులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : వాల్మీకులను ఎస్టీలుగా గుర్తించాలని, అలాగే వాల్మీకి జయంతిని జాతీయ సెలవు దినంగా ప్రకటించాలని వాల్మీకి మహాసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముత్తరాసి హరికృష్ణ అన్నారు. చెంబకూరు రోడ్డు రాగిమాను వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాల్మీకులు ఎస్టీ రిజర్వేషన్ అమలుపై అన్ని సంఘాలు కలసి రావాలని పిలుపునిచ్చారు. వాల్మీకి మహర్షి జయంతిని దేశ వ్యాప్తంగా వైభవోపేతంగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఆయన జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకి సంఘాలు అన్ని ఏకతాటిపైకి వచ్చి రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్ అమలుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలన్నారు. సమావేశంలో వాల్మీకి మహాసేన నాయకులు ఎన్.సుదర్శన్‌బాబు, బొగ్గిటి కృష్ణమూర్తి, ఎస్.కృష్ణమూర్తి, రామకృష్ణ, సుస్మిత్, మల్లప్ప, కె.మునివెంకటప్ప, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం

రాయచోటి, న్యూస్‌టుడే : రాయచోటి పట్టణంలో ఠాణా సమీపంలోని అజంతా ఎలక్ట్రికల్ దుకాణంలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. దుకాణంలోని గుమస్తాలు నమాజ్‌కు వెళ్లిన సమయంలో ప్రమాదం జరిగి మంటలు చెలరేగడంతో ఎలక్ట్రికల్ సామగ్రి కాలిపోయాయి. సుమారు రూ.30 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో పక్కనున్న దుకాణాలకు మంటలు వ్యాపించకుండా చర్యలు తీసుకున్నామని రాయచోటి అగ్నిమాపక శాఖ అధికారి వెంకట్రామిరెడ్డి పేర్కొన్నారు. ప్రమాదంలో నష్టం వివరాలు అంచనా వేస్తున్నామని స్పష్టం చేశారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అనుమతుల్లేని భవన నిర్మాణాలపై నివేదించండి

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలపై విచారించి నివేదిక ఇవ్వాలని డీపీవో బాలకృష్ణారెడ్డి ఆదేశించారు. శుక్రవారం గ్రామీణ మండలం తట్టివారిపల్లె, కొండామర్రిపల్లె పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై, సంపద కేంద్రాల నిర్వహణపై క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. తట్టివారిపల్లె సచివాలయంలో ఇళ్ల అనుమతులు, నీటి కుళాయి అనుమతుల దస్త్రాలను పరిశీలించారు. చాలా గ్రామాల్లో పంచాయతీ అనుమతులు లేకుండా ఇళ్ల, భవన నిర్మాణాలు, జరుగుతున్నాయని, అనుమతులు లేకుండా తాగునీటి కుళాయిలు వేసుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, పంచాయతీ ఆదాయానికి నష్టం కలిగే పనులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సచివాలయాల పరిధిలో ఇళ్ల నిర్మాణాలపై విచారించి నివేదిక ఇవ్వాలని ఎంపీడీవోలను ఆదేశించినట్లు చెప్పారు. గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం చేయకూడదని కార్యదర్శులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో నాగరాజు, ఎంపీడీవో మస్తాన్‌వల్లి, ఈవోపీఆర్డీ అబ్దుల్‌షుకూర్, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



తనిఖీ చేస్తున్న డీపీవో బాలకృష్ణారెడ్డి, పక్కన డీఎల్‌పీవో నాగరాజు

జాతీయస్థాయి గణిత పరీక్షలో శ్రీహాసిని ప్రతిభ



నిమ్మనపల్లె, న్యూస్‌టుడే: నిమ్మనపల్లె ఆదర్శ పాఠశాల పదో తరగతి విద్యార్థిని శ్రీహాసిని ఆల్ గర్ల్స్ మాథ్స్ నచ్చర్ క్యాంప్ (ఏజీఎంఎన్‌సీ)-2024 జాతీయ స్థాయి ఆన్‌లైన్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ కేఎస్ఎన్‌మూర్తి తెలిపారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ పరీక్షలో రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల తరపున ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి కావడం గమనార్హమన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ 12 నుంచి 15 ఏళ్లలోపు బాలికలు మాత్రమే ఈ పరీక్షకు అర్హులన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్షలో గణితంలో బాలికలను ప్రోత్సహించాలన్న సంకల్పంతో అజిం ప్రేమ్‌జీ బెంగళూరు వారు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షలో సుమారు 40 వేల మంది పరీక్షలు రాయగా అందులో 60 మంది మాత్రం ఎంపికయ్యారని తెలిపారు. పరీక్షలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల తరపున రాసిన బాలికల్లో నిమ్మనపల్లె ఆదర్శ పాఠశాల నుంచి ఏకైక విద్యార్థిని ఎంపిక కావడం శుభ పరిణామం అన్నారు. ఎంపికైన విద్యార్థినికి బెంగళూరులో రెండు వారాల పాటు శిక్షణ ఇవ్వడంతో పాటు మరో మూడు నెలల పాటు ఆన్‌లైన్ గణితం తరగతులకు హాజయ్యే విధంగా అవకాశం కలుగుతుందన్నారు. ప్రిన్సిపల్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులు బాలికను అభినందించారు.

పిడుగుపాటుకు కాలిపోయిన నియంత్రికలు

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: బి.కొత్తకోట మండలం శీలంవారిపల్లె ఎస్సీ కాలనీలో పిడుగుపాటుకు ఓ ఇంటి గోడ దెబ్బతినడంతో పాటు రెండు నియంత్రికలు కాలిపోయాయి. గురువారం రాత్రి మండలంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. శీలంవారిపల్లె ఎస్సీ కాలనీలో జయమ్మకు చెందిన ఇంటిపై పిడుగు పడింది. దీంతో ఇంటికి రెండు చోట్ల రంధ్రాలు పడటంతో పాటు గోడలు దెబ్బతిన్నాయి. ఇదే ప్రాంతంలోని రెండు నియంత్రికలు కాలిపోవడంతో ఈ కాలనీలో విద్యుత్తు సరఫరా ఆగిపోయింది. కాలనీలో అంధకారం అలముకోవడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. స్థానిక తహసీల్దారు మహమ్మద్ అన్సారీ, ఆర్ఐ వీరాంజినేయులు, వీఆర్వో రవికుమార్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్తుశాఖ ఏఈ గిరిధర్ రంగంలోకి దిగి ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేయించారు. శుక్రవారం ఉదయం తొమ్మిది గంటలకు సరఫరాను పునరుద్ధరించినట్లు ఏఈ తెలిపారు.



శీలంవారిపల్లె నియంత్రికను అమర్చుతున్న సిబ్బంది

ఇసుక క్వారీల పరిశీలన

పెనగలూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నారాయణ నెల్లూరు, కోమంతరాజపురం ఇసుక క్వారీ ప్రాంతాలను శుక్రవారం సాయంత్రం ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పారదర్శకంగా ఇసుక రవాణా చేయాలని సూచించారు. ఎస్సై రవి ప్రకాష్‌రెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బంది విధులకు ఆటంకం

పది మందిపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : ఆసుపత్రిలో సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తూ గొడవకు పాల్పడిన పది మందిపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ సీఐ రామచంద్ర తెలిపారు. మదనపల్లె ప్రభుత్వాసుపత్రిలో ఈ నెల 16వ తేదీ రాత్రి పాత గొడవలతో కొట్టుకుని గాంధీపురానికి చెందిన కొందరు ఆసుపత్రికి వచ్చారన్నారు. అయితే రెండు వర్గాల వారు ఆసుపత్రికి ఒకేసారి రావడంతో ఆసుపత్రిలో గొడవపడ్డారన్నారు. అక్కడే ఉన్న అవుట్ పోస్టు సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది వారించినా వినకుండా గొడవకు పాల్పడ్డారన్నారు. దీనిపై ఆసుపత్రి అవుట్ పోస్టు కానిస్టేబుల్ భాస్కర్‌నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జి.పునీత్‌కుమార్, జి.రేణుక, జి.రమణమ్మ, రవి, శశి, సంధ్య, శివమ్మ, నాగమణి, అరుణ్, గంగులమ్మలపై ప్రభుత్వ సిబ్బంది విధులకు ఆటంకం కలిగిస్తూ ఇబ్బందులకు గురిచేశారని గురువారం రాత్రి కేసు నమోదు చేశామన్నారు. ప్రభుత్వ విధులకు ఎవరైనా ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ముందస్తు చర్యలతో దోమల నివారణ

పీలేరు గ్రామీణ: ముందస్తు చర్యలతో దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేయచ్చని డీఎంహెచ్‌వో కొండయ్య అన్నారు. శుక్రవారం తలపుల పీహెచ్‌సీ పరిధిలో దోమల మందు పిచికారి చేశారు. దోమల నియంత్రణ, సురక్షిత నీరు, తాజా ఆహారాన్ని తీసుకోవడం, చేతులు శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని డీఎంహెచ్‌వో అన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తరచూ దోమల నివారణ చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. వైద్యుడు రమేష్‌రెడ్డి, విద్యాసాగర్, హెచ్‌ఈ కొండయ్య, కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

నాగరాజు.... క్రీడా గురూ!

- నిత్య కృషీవలుడా వ్యాయామోపాధ్యాయుడు
- పల్లె నుంచి అంతర్జాతీయ స్థాయికి ప్రస్థానం

అతనో వ్యాయామోపాధ్యాయుడు... అందరిలా ఉద్యోగం చేశామా? ఇంటికి వెళ్లామా? అని కాకుండా పల్లెల్లోని విద్యార్థులను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు. తనకు తెలిసిన విద్యను పది మందికీ పంచడమే కాకుండా వారి జీవితాల్లో వెలుగులు నింపాలన్నదే ఆయన జీవిత లక్ష్యం... అందుకే ఏ పాఠశాలకు వెళ్లినా... అక్కడ క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దుతూ పతకాల పంట పండిస్తున్నారు. అలా వివిధ ప్రాంతాల్లో 250 మందిని రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ఆయన పనిచేస్తున్న బడుల్లో విద్యార్థులకు క్రీడల్లో ఆసక్తి ఉండాలే కానీ సెలవుల్లో కూడా వారి కోసం విధులకు హాజరవుతారు. వివిధ క్రీడలకు కోచ్‌గా, రెఫరీగా రాణిస్తూనే, విద్యార్థులను ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు వాల్మీకిపురానికి చెందిన నాగరాజు.

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : వాల్మీకిపురం పట్టణానికి చెందిన నాగరాజు ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఈయన 2002 జనవరిలో పెద్దమండ్యం మండలం కలిచెర్లలో ప్రభుత్వ వ్యాయామోపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. అప్పటి నుంచి మదనపల్లె డివిజన్‌లోని కలిచెర్ల, కొత్తమంచూరు, తరిగొండ, సీటీఎం తదితర ప్రాంతాల్లో పనిచేశారు. దాదాపు 22 ఏళ్ల పాటు మదనపల్లె డివిజన్‌లోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాయామోపాధ్యాయుడిగా పనిచేస్తూ ఎంతో మంది ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. గ్రామీణ క్రీడాకారులకు బాల్ బ్యాడ్మింటన్, నెట్‌బాల్, బాస్కెట్‌బాల్, హ్యాండ్ బాల్, ఖోఖో, కబ్బడి, హాకీ క్రీడల్లో తర్ఫీదునిచ్చారు. క్రీడల పట్ల ఆయనకున్న ఇష్టంతో గతంలో వాల్మీకిపురంలో రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్, బాస్కెట్ బాల్, నెట్‌బాల్, హ్యాండ్‌బాల్ క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే గుర్రంకొండ మండలం తరిగొండలో రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ మదనపల్లెలో రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్, హాకీ, క్రీడా పోటీలు జరిపించారు. 2016లో తరిగొండలో జోనల్స్, ఇంటర్ జోనల్స్ క్రీడ పోటీలూ జరిపించారు. నాగరాజు సారథ్యంలో మదనపల్లె డివిజన్‌కు చెందిన 25 మంది క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించారు. రాష్ట్రస్థాయిలో 200 మంది క్రీడాకారుల దాక వివిధ విభాగాల్లో జరిగిన క్రీడా పోటీల్లో పాల్గొని రాణించారు. గత 20 ఏళ్లుగా ఏటా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించి వారికి, ఉచితంగా మౌలిక వసతులతో పాటు పోషకాహారం అందిస్తూ గ్రామీణ క్రీడాకారులకు శిక్షణ ఇస్తూ ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్నారు.



మహిళలకు బాస్కెట్ బాల్ శిక్షణ ఇస్తున్న నాగరాజు



ఉత్తమ వ్యాయామోపాధ్యాయుడిగా పురస్కారాన్ని అందుకుంటూ..

ఇప్పటి వరకు సారథ్యం వహించిన క్రీడలు

★ 2002లో 32వ జాతీయ క్రీడలకు ఏపీ తరపున నెట్‌బాల్ రెఫరీ ★ 2006లో ఏషియన్ ఛాంపియన్ షిప్ బెంగళూరులో జరిగిన నెట్‌బాల్ పోటీల్లో భారత్ తరపున రెఫరీ ★ 2017లో ఎస్‌జీఎఫ్ఐ ప్యారీస్‌లో జరిగిన స్కూల్ గేమ్ ఫెడరేషన్ ప్రపంచ క్రీడా పోటీల్లో ఇండియా అండర్-17 బాలికల టీం కోచ్‌గా వ్యవహరించారు. ★ వివిధ జాతీయ పాఠశాల క్రీడల్లో హ్యాండ్‌బాల్, స్పాట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్లకు కోచ్‌గా వ్యవహరించారు. ★ వరసగా మూడు పర్యాయాలు రాష్ట్ర అవార్డులు ★ 2021, 2022, 2023 ఏడాదుల్లో రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ ఎక్సలెంట్ అవార్డులను మూడు పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వరసగా అందుకున్నారు.

క్రీడల కోటాలో ఉద్యోగం



మా గురువు నాగరాజు దగ్గర హైస్కూల్ విద్యను అభ్యసిస్తూ హ్యాండ్‌బాల్‌లో శిక్షణ పొందా, ఆయన శిక్షణలో రాటుదేలి జాతీయ స్థాయి క్రీడలకు ప్రాతినిధ్యం వహించాం. క్రీడల కోటాలో ఉద్యోగం పొంది ప్రస్తుతం బ్లాక్ క్యాట్ కమెండో ట్రైనింగ్‌లో ఉన్నా.

- బాషా సాహెబ్, హ్యాండ్ బాల్ జాతీయ క్రీడాకారుడు, సన్యాసివారిపల్లె, కలికిరి మండలం

బాస్కెట్‌బాల్‌లో శిక్షణ పొందా



పీఈటీ అంటే నాగరాజు సర్.. ఆయన వద్ద బాస్కెట్‌బాల్ శిక్షణ పొందా, విశ్వవిద్యాలయ, రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో విశేష ప్రతిభ చూపి రాణించా. ప్రస్తుతం బీటెక్ చదువుతున్నా, నా భవిష్యత్తుకు ఈ క్రీడలు తోడ్పాటునిస్తాయని నమ్ముతున్నా.

- గాయత్రి, బీటెక్, రెడ్డివారిపల్లె, తరిగొండ, గుర్రంకొండ మండలం

మదనపల్లె
•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

అపూర్వ సమ్మేళనం


సమావేశమైన పూర్వ విద్యార్థులు

రామసముద్రం, న్యూస్‌టుడే: అందరం కుటుంబాలతో స్థిరపడ్డాం... చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేసుకుందామని పూర్వ విద్యార్థులు తీర్మానించారు. రామసముద్రం ఉన్నత పాఠశాలలో 1987-88లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు శుక్రవారం పాఠశాలలో సమావేశమయ్యారు. వివిధ రంగాల్లో స్థిరపడ్డ వారు పాఠశాల అభివృద్ధికి ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు వివరించారు. అధ్యక్షుడు విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణారెడ్డి, కోశాధికారి నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలి

ముదివేడు (కురబలకోట): మండలంలో న్యాయం కోసం వచ్చే ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు తగిన న్యాయం జరిగేలా చూడాలని మాల మహానాడు జాతీయ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ యమలా సుదర్శనం విజ్ఞప్తి చేశారు. ముదివేడు పోలీసు స్టేషన్లో ఎస్‌ఐ దిలీప్ కుమార్‌ను శుక్రవారం కలిసి తమ సమస్యలను వివరించారు. ఎస్సీ, ఎస్టీలు తగిన సమస్యలతో సతమతమవుతున్నారని, పోలీసులను ఆశ్రయిస్తే, వారికి న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సంఘం సభ్యులు పాల్గొన్నారు.


ఎస్‌ఐ దిలీప్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాల మహానాడు నాయకులు

మేమున్నాం... మీకు తోడుగా...

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

స్పందనకు వందనం

● మిషన్ కాంపౌండ్ చుట్టూ చెత్త దిబ్బలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ఇక్కడ చెత్తచెదారం గుట్టలు పేరుకుపోవడంతో ఆగస్టు 18న స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు 'ఈనాడు'లో 'మేమున్నాం... మీకుతోడుగా'లో భాగంగా కథనం ప్రచురితమైంది. దీంతో పురపాలక కమిషనర్ ప్రమీల స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేయించి, చెత్తను సంపద కేంద్రానికి తరలించారు.

● గ్రామీణ మండలం బసినికొండ పంచాయతీ సచివాలయం సమీపంలోని విద్యుత్తు స్తంభం చుట్టూ పిచ్చి మొక్కలు, తీగ మొక్కలు తొలగింపు చర్యలు చేపట్టారు. స్థానికంగా పిచ్చి మొక్కలతో ప్రమాదకరంగా ఉండటంతో గ్రామీణులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ నెల 6న 'ఈనాడు'లో సమస్యపై కథనం ప్రచురితమైంది. సంబంధించిన పంచాయతీ అధికారులు చర్యలు తీసుకున్నారు.

● సచివాలయం వద్ద కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పుంగనూరు రోడ్డులోని బసినికొండ పంచాయతీ పరిధిలో చెత్తదిబ్బలు పేరుకుపోవడంతో స్థానికులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు ఇచ్చిన సమాచారం మేరకు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి ఈ నెల 6న 'ఈనాడు'లో ప్రచురించడం జరిగింది. దీంతో అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేశారు.

● కోళ్లబైలు బయారెడ్డి కాలనీలో వీధి దీపాలు మరమ్మతులు చేపట్టారు. కాలనీలో పలు ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగకపోవడంపై స్థానికుల సమాచారం మేరకు ఈ నెల 5న 'ఈనాడు'లో 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా సమస్యను ప్రచురితమైంది. ఈ మేరకు పంచాయతీ సర్పంచ్ ఆనందరెడ్డి స్పందించి సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు.

● ఎస్బీఆర్ వీధిలో పురపాలక సంఘం కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఇక్కడి సమస్యపై కాలనీవాసులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు ఇచ్చిన సమాచారం మేరకు ఈ నెల 5న 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

● బసినికొండ పుంగనూరు రోడ్డులోని విద్యుత్తు నియంత్రిక చుట్టూ పిచ్చి మొక్కలు తొలగింపు చేపట్టారు. స్థానికంగా ప్రమాదకరంగా విద్యుత్తు నియంత్రిక చుట్టూ వర్షం కారణంగా పిచ్చి మొక్కలు పొదలు అల్లుకున్నాయి. గ్రామీణులు 'మేమున్నాం... మీకుతోడుగా'కు సమాచారం ఇవ్వడంతో సమస్యపై ఈ నెల 7న 'ఈనాడు'లో ప్రచురితమైంది. దీంతో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

● అగ్గిపెట్టెల ఫ్యాక్టరీ సమీపంలో పంచాయతీ కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తదిబ్బలను తొలగించారు. గ్రామంలోని ఈ ప్రాంతంలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటంతో ఈ ప్రాంత ప్రజలు 'మేమున్నాం... మీకుతోడు'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ నెల 7న 'ఈనాడు'లో సమస్య ప్రచురితమైంది. ఎంపీడీవో మస్తాన్‌వల్లీ ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టి చెత్తదిబ్బలను సంపద కేంద్రానికి తరలించారు.

● గ్రూప్ థియేటర్ ప్రాంతంలో పురపాలక సంఘం కార్మికులు పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పట్టణంలోని రాంగోపాల్ నాయుడు వీధిలో చెత్త దిబ్బలు పేరుకుపోవడంతో ఈ ప్రాంతవాసులు 'మేమున్నాం... మీకుతోడు'కు సమాచారం ఇచ్చారు. దీనిపై ఈ నెల 7న 'ఈనాడు'లో సమస్యపై కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన అధికారులు పారిశుద్ధ్య పనులు చేయించారు.

తుంపర వానలతో పారని చేను

● చెరువుల్లోకి చుక్కనీరు చేరక వెలవెల ● తాగు, సాగునీటికి తప్పని ఇబ్బందులు

మదనపల్లె పట్టణం, పీలేరు, న్యూస్‌టుడే : కోస్తాంధ్రను వరదలు ముంచెత్తాయి... రాయలసీమలోని కొన్ని జిల్లాల్లో తుపాను ప్రభావం వల్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. అయితే మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లోని మండలాల్లో మాత్రం తుపాను ప్రభావం నామమాత్రమే. చెరువుల్లో చుక్కనీరు చేరలేదు. వచ్చే వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పవన్న సంకేతాలు ఉత్పన్నమౌతున్నాయి. వర్షాలు మెండుగా కురిసి చెరువులు, ప్రాజెక్టులు నిండితేనే ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు అభివృద్ధి చెంది తాగునీటికి ఇబ్బందులుండవు. అయితే గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలు వల్ల ఈ ప్రాంతంలో ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు.

నమోదైన వర్షపాతం వివరాలు

మండలం	వర్షపాతం (మి.మీ.)
మదనపల్లె	18.4
నిమ్మనపల్లె	14.8
రామసముద్రం	21.0
తంబళ్లపల్లె	32.6
పీటీఎం	19.6
ములకలచెరువు	21.8


నీరులేక ఎండిపోయిన బాహుదా నది (పాత చిత్రం)

100 మేజర్ ఇరిగేషన్ చెరువులు

మదనపల్లె జల వనరులశాఖ పరిధిలోని మొత్తం 2,412 చెరువులు ఉన్నాయి. ఇందులో తంబళ్లపల్లె డివిజన్ 47, పీలేరు 20, వాల్మీకిపురం 16, మదనపల్లె డివిజన్‌లో 17 మేజర్ ఇరిగేషన్ (100 ఎకరాలు సాగుపైబడి సాగు విస్తీర్ణం) చెరువులున్నాయి. అలాగే 2,312 మైనర్ ఇరిగేషన్ (100 ఎకరాలకంటే తక్కువ సాగు విస్తీర్ణం) చెరువులున్నాయి. పీటీఎం మండలం కందుకూరు చెరువు, రంగసముద్రం చెరువు, మదనపల్లె మండలం సీటీఎం పెద్దచెరువు, వెంకటమ్మచెరువు, మేడిపల్లె చెరువు పీలేరు మండలం అగ్రహారం చెరువు ప్రధానమైనవి. గత నాలుగు రోజులుగా కురిసిన వర్షానికి ఈ చెరువుల్లోకి చుక్కనీరు వచ్చి చేరలేదు.

నాలుగు రోజులుగా ముసురు వర్షాలు : నాలుగు రోజులుగా తుపాను ప్రభావం వల్ల మదనపల్లె డివిజన్‌లోని పలు మండలాల్లో ముసురు వర్షాలు పడుతున్నాయి. అయితే ఈ వర్షాలు వల్ల ఈ ప్రాంతానికి ఎలాంటి ఉపయోగం కలుగలేదు. చెరువులు, కుంటల్లోకి చుక్కనీరు వచ్చి చేరలేదు. ప్రతి సంవత్సరం అక్టోబరు, నవంబరు నెలల్లో కురిసే వర్షాలపైనే ఈ ప్రాంత ప్రజలు ఆశలు పెట్టుకుంటారు. అక్టోబరు నెలలో వచ్చిన తుపాను వల్ల వర్షాలు రాకపోగా, నవంబరు నెలలోనైనా వరుణుడు కరుణిస్తాడన్న ఆశతో ఉన్నారు.

వేసవిలో తాగునీటి సమస్య తప్పదా?

ప్రస్తుతం వర్షాలు పడకపోవడం, చెరువుల్లో నీరు నిల్వ ఉండకపోవడం వంటి కారణాలు వచ్చే వేసవిలో తాగునీటి సమస్యకు సంకేతాలు. మదనపల్లె డివిజన్‌లోని చెరువుల్లో నీరుంటేనే గ్రామాల్లో తాగునీరు సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది. ● పురపాలక సంఘంలో బోరుబావుల ద్వారా ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు. భూగర్భ జలాలు వృద్ధి చెందాలంటే పరిసర ప్రాంతాల్లోని చెరువుల్లో మెండుగా నీటి నిల్వలుండాలి. కదిరమ్మ చెరువు, మేడిపల్లె చెరువు, వెంకటమ్మ చెరువు, ఓబులనాయుని చెరువుల్లో నీటి నిల్వలుంటేనే భూగర్భ జలాలు వృద్ధి చెంది మదనపల్లె ప్రజల దాహార్తి తీరేది. ● ప్రస్తుతం మదనపల్లెలో 1,000 అడుగులపైనే బోర్లు వేసినా నీరు పడటంలేదంటే పరిస్థితి ఎంత క్లిష్టంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.


పీలేరు మండలంలో నీరులేక వెలవెలపోతున్న అగ్రహారం చెరువు

● తంబళ్లపల్లె మండలంలోని పెద్దేరు ప్రాజెక్టు, నిమ్మనపల్లె మండలంలోని బాహుదా ప్రాజెక్టుల్లో కూడా నీరు డెడ్‌స్టోరేజీ స్థాయిలో ఉన్నాయి. వచ్చే నవంబరులో వర్షం పడితేనే ఈ ప్రాంతంలో తాగు, సాగునీటి కొరత తీరుతుంది.

భవనాల తొలగింపుపై మళ్లీ సర్వే

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు పట్టణం మదనపల్లె-తిరుపతి జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న వంతెనకు రైల్వేగేట్ దిగువ సిమెంట్ పిల్లర్ ఏర్పాటుకు ఎన్‌హెచ్ జేఈ ధనలక్ష్మి, సర్వేయర్ అరుణ, రెవెన్యూ కార్యదర్శి శిల్పలు శుక్రవారం సర్వే చేశారు. పిల్లర్ రైల్వేగేట్ సమీపంలో ఏర్పాటు చేయనున్నందున వాహనాలు వెళ్లేందుకు సౌకర్యంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాల్సి ఉంది. వంతెన రూ.37 కోట్లతో నిర్మిస్తున్నందున రైల్వేగేటుకు ఇబ్బంది లేకుండా సర్వీసు రోడ్డు ఏర్పాటుకు ప్రైవేట్ స్థలంతో పాటు పక్కా భవనాలను కూడా ధనలక్ష్మి పరిశీలించారు. సర్వీసు రోడ్డుకు ఏ ప్రాంతం సౌకర్యంగా ఉంటుందన్న విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని ఆమె స్పష్టం చేశారు. రైల్వేగేట్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో కాకుండా దిగువన సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలంటే తప్పకుండా పక్కా భవనాలను తొలగించాల్సి వస్తోందని తెలిసి భవన యజమానులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వంతెన పనులకు మదనపల్లె మలుపు నుంచి పద్మావతినగర్ ప్రవేశ ద్వారం వరకు రోడ్డుకు రెండు వైపులా వంతెన కోసం పక్కా భవనాలను తొలగించి ప్రైవేట్ స్థలంలో నిర్మాణాలు చేసిన వారికి పరిహారం కూడా ఎన్‌హెచ్ అధికారులు చెల్లించారు. మళ్లీ పిల్లర్ కోసం సర్వే చేస్తుంటే ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


సర్వీసు రోడ్డు ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఏఈ ధనలక్ష్మి, సర్వేయర్ అరుణ, రెవెన్యూ కార్యదర్శి శిల్ప

అభ్యసనా వైకల్యాలపై అవగాహన ర్యాలీ

మదనపల్లె విద్య: విద్యార్థుల్లో వచ్చే నిర్దిష్ట అభ్యసనా వైకల్యాలు (డిస్లెక్సియా)పై తల్లిదండ్రులు అవగాహన పెంచుకోవాలని మదనపల్లె ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్ అన్నారు. శుక్రవారం భవిత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అక్షరాలు తలకిందులుగా రాయడం, వెనక్కు రాయడం వంటి లక్షణాలు కలిగి ఉండటం, రాయడం, చదవడం, అర్థం చేసుకోవడం, గుర్తించడంలో సమస్య ఉన్న విద్యార్థులను చిన్నప్పుడే గుర్తించి వారికి శిక్షణ ఇస్తే అభ్యసన సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. అనంతరం ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, భవితా కేంద్రం ఐఈఆర్‌పీఎస్ నాగేంద్ర, రెడ్డెమ్మ, సీజీఆర్ రెడ్డిరాణి పాల్గొన్నారు.


ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు, భవితా కేంద్రం సిబ్బంది, విద్యార్థులు

మండల సమావేశం వాయిదా

కురబలకోట: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం కోరం లేక పోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో గంగయ్య తెలిపారు. గతంలో సమావేశం రెండుసార్లు ఏర్పాటు చేయగా, కోరం లేక వాయిదా పడిన సంగతి తెలిసిందే. మండల పరిషత్ సమావేశం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట శుక్రవారం పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. సమావేశానికి వైకాపాకు చెందిన ఎంపీటీసీలు ఇద్దరు మాత్రమే రావడంతో, సుమారు గంట సేపు వేచి చూసినా ఎంపీటీసీలు రాకపోవడంతో సమావేశం వాయిదాకు దారి తీసింది.

గొర్రెల పెంపకందారుల సంఘం ఎన్నిక

పెద్దతిప్పసముద్రం: పీటీఎం, బి.కొత్తకోట మండలాల గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడిగా మలారి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీటీఎం ఇందిర క్రాంతి భవనంలో ఏపీఎం హరి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా పద్మావతమ్మ, ఉపాధ్యక్షుడిగా రమేష్, కార్యదర్శిగా లక్ష్మీదేవి, కోశాధికారిగా హరీష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి రెండు మండలాల పెంపకందారుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కూరగాయల విక్రయానికి దరఖాస్తులు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : రైతులు తమ పంట దిగుబడులను రాజీవ్ రైతు బజారులో విక్రయించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలని మార్కెటింగ్‌శాఖ ఏడీ త్యాగరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మదనపల్లె పట్టణం వారపుసంత పక్కన ఉన్న రైతుబజారును పరిశీలించారు. రైతులు ఎలాంటి రుసుం చెల్లించకుండా నేరుగా కొనుగోలుదారునికి విక్రయించుకోవచ్చని తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమ ఆధార్‌కార్డు, భూమి 1-బీ, పాస్‌పోర్టు ఫోటో జతపరిచి గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రంలో లేదా రైతు బజార్‌లో అందజేయాలని తెలిపారు.

ఆక్రమణలపై అధికారుల పరిశీలన

స్పందనకు వందనం

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: లింకిశెట్టి చెరువు సర్వే చేపట్టి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. గ్రామీణ మండలం తట్టివారిపల్లె పరిధిలోని ఈ చెరువు ఆక్రమణకు గురవుతుండటంతో పాటు.. వంక అన్యాక్రాంతంపై 'ఈనాడు'లో ఈ నెల 18న 'లింకిశెట్టి చెరువు... ఆక్రమణల దరువు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ ఖాజాబీ స్పందించారు. జలవనరులశాఖ ఏఈ బాబురాజేంద్రప్రసాద్‌తో పాటు, తహసీల్దారు ఆదేశాలతో మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్ప, వీఆర్వో మాధవరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొండ వంక పూడ్చివేసినట్లు గుర్తించారు. చెరువులో మట్టిదిబ్బలు వేశారని చెప్పారు. చెరువును, కొండవంకలను రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి సర్వే చేపట్టి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని, ఆక్రమణలకు గురైనట్లు తేలితే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని, జలవనరులుగా ఉన్న ఈ వంకలు, చెరువులను పూడ్చితే భవిష్యత్తులో తాగు, సాగునీటి సమస్యలు వస్తాయని, ఇలా జరగకుండా చర్యలు చేపడతామని అధికారులు వెల్లడించారు.


చెరువు వంకను పరిశీలిస్తున్న జలవనరులశాఖ ఏఈ బాబురాజేంద్రప్రసాద్, ఆర్‌ఐ రెడ్డెప్ప, సర్వేయర్ రెడ్డిశేఖర్‌లు

22న ఉద్యోగ మేళా

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే : పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 22వ తేదీన ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ మేళాలో యంగ్ ఇండియా, టాటా క్యాపిటల్, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగాలు కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్ల యువతీ యువకులు అర్హులని ఆయన తెలిపారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత ధ్రువపత్రాలతో పాటు, ఆధార్, బయోడేటాతో హాజరు కావాలని ఆయన చెప్పారు. పూర్తి వివరాలకు 9966086996 నెంబరుకు సంప్రదించాలని ఆయన చెప్పారు.

క్యాన్సర్ రోగులకు కురుల దానం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : క్యాన్సర్ బాధితులకు ఉచితంగా విగ్గులు తయారు చేసి ఇచ్చేందుకు హెల్పింగ్ మైండ్స్ సంస్థ చేస్తున్న కార్యక్రమానికి గాను మదనపల్లెకు చెందిన షబానా శుక్రవారం కురులు దానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెల్పింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో తాను ప్రతి సంవత్సరం రక్తదానం చేస్తున్నానన్నారు. అలాగే కురులు దానం చేసినట్లు తెలిపారు. రక్తదానంతో పాటు కురులు దానం చేసిన షబానాను హెల్పింగ్ మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు అబుబకర్ సిద్దిక్‌తో పాటు సభ్యులు అభినందించడంతో పాటు ఆమెకు పూల మొక్కను, ధ్రువపత్రాన్ని అందజేశారు.

పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ

పెద్దతిప్పసముద్రం: పీటీఎం పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం మదనపల్లె డీఎస్పీ కొండయ్య నాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని దస్త్రాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు ఇబ్బంది కలగకుండా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. సీఐ రాజా రమేష్, ఎస్‌ఐ నరసింహుడు ఉన్నారు.

మాజీ సీఎంను కలిసిన చింతల

వాల్మీకిపురం: తాడేపల్లెలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా పీలేరు నియోజకవర్గంలోని పార్టీ వ్యవహారాలను మాజీ సీఎం దృష్టికి తీసుకుపోయి పార్టీ పరిస్థితులను వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ పటిష్టతకు గట్టిగా కృషి చేయాలని మాజీ సీఎం తనకు సూచించినట్లు చింతల తెలిపారు.

అన్నపై తమ్ముడి దాడి

కలికిరి గ్రామీణ: వ్యవసాయ పొలం వద్దనున్న బోరు విషయమై తమ్ముడు అన్నపై తీవ్రంగా దాడిచేసి గాయపర్చిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై మధుసూదనాచారి తెలిపారు. మండల పరిధి గుండ్లూరు పంచాయతీ గల్లావారిపల్లెకు చెందిన పెద్దరెడ్డెప్ప శుక్రవారం తమ జాయింటు భూమిలో ఉన్న వ్యవసాయ బోరు వద్దకు వెళ్లగా అతని తమ్ముడు చిన్నరెడ్డెప్ప ఈ బోరులో నీకు భాగం లేదని కర్రతో కొట్టి గాయపర్చినట్లు తెలిపారు. బాధితుని కేకలు విన్న పరిసర ప్రాంత రైతులు వచ్చి తమ్ముని బారినుండి అన్నను విడిపించి కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించినట్లు వివరించారు. పెద్దరెడ్డెప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె నేరవార్తలు : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. మదనపల్లె మండలం యనమలవారిపల్లెకు చెందిన యువతి (19) గత నెల 29వతేదీన ఇంట్లో నుంచి వెళ్లి పోయింది. ఆమె కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ దొరక్కపోవడంతో గురువారం రాత్రి యువతి కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి తల్లి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాఠశాలల్లో శానిటైజర్ల పంపిణీ

వాల్మీకిపురం, న్యూస్‌టుడే : మండలంలోని 55 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు సంబంధించి శానిటైజర్లు (1300 లీటర్లు)ను ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు శుక్రవారం ఎమ్మార్సీ భవనంలో ఎంఈవో వెంకటరత్నం పంపిణీ చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని మరుగుదొడ్లకు ఈ శానిటైజర్లను పరిశుభ్రతను ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంలకు ఎంఈవో సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు బాలాజీ, లక్ష్మీనారాయణ, సీఆర్‌పీలు విజయ్, రామస్వామి, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

మదనపల్లె అర్బన్: పట్టణంలోని టౌన్ సెక్షన్ పరిధిలో శనివారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ముజామిల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు. విద్యుత్తు ఉపకేంద్రాల మరమ్మతుల కారణంగా ఎస్టేట్, సీటీఎం రోడ్, ఆర్టీసీ బస్టాండు, రామారావు కాలనీ, స్టేట్ బ్యాంక్ కాలనీ, పారానగర్, సునీల్ సినిమా థియేటర్ ప్రాంతం, బంబూబజార్, టౌన్ బ్యాంకు కూడలి, దేవతానగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని తెలిపారు.

కూటమితో పల్లెలకు పూర్వ వైభవం


కంభంవారిపల్లె మండలం గాలివారిపల్లెలో సిమెంటు రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న నాయకులు

కూటమి ప్రభుత్వ హయాంలో పల్లెకు పూర్వ వైభవం రానుందని తెదేపా నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తల నడుమ అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాలు నిర్వహించారు. మండల స్థాయిలో గుర్తించిన పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. తెదేపా మండల పార్టీ అధ్యక్షులు, వివిధ విభాగాల బాధ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి.

- న్యూస్‌టుడే, మదనపల్లె క్లస్టర్ బృందం


వాల్మీకిపురం మండలం గొల్లపల్లెలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న తెదేపా నాయకులు, అధికారులు


ములకలచెరువు మండలం గోపిదిన్నె దళితవాడలో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ


కలకడ నవాబుపేటలో సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న సర్పంచి శివ, కూటమి నాయకులు

గ్రామీణ రహదారులకు వర్షం దెబ్బ!

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: అల్పపీడనం దృష్ట్యా మదనపల్లె నియోజకవర్గంలో రోడ్లు బురదమయంగా మారాయి. మండల కేంద్రాలకు వెళ్లే రహదారులపై గతంలో వైకాపా ప్రభుత్వం ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రస్తుతం కురిసిన వర్షంతో గుంతలు ఏర్పడ్డాయి. వర్షపునీరు నిలబడి బురదగా మారింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లు గుంతలుగా మారి ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ● మదనపల్లె డివిజన్ కేంద్రం నుంచి రామసముద్రం వెళ్లే మార్గంలోని కొత్తపల్లె, ఈశ్వరమ్మ కాలనీ, ఎస్‌బీఐ కాలనీ, చెంబుకూరు రహదారుల్లో వర్షపు నీరు నిలబడి రాకపోకలతో తారురోడ్లు కంకరలేచిపోయి గుంతలుగా మారింది. ● మదనపల్లె నుంచి నిమ్మనపల్లె మండల కేంద్రానికి వెళ్లే మార్గంలోని పాములచెరువు సమీపంలోని రహదారి దెబ్బతింది. రామచర్లపల్లె వద్ద పెద్దచెరువు సమీపంలోని దారి గుంతలమయంగా మారింది. మదనపల్లె మండలం పొన్నేటిపాళ్యం మార్గంలో దాదాపు మూడు కిలోమీటర్లు గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. మలుపు ప్రాంతంలో రాత్రివేళల్లో ద్విచక్ర వాహనదారులు, ఆటో చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 150వ మైలు నుంచి బొమ్మనచెరువుకు వెళ్లే మార్గంలో రహదారుల పరిస్థితి ఇలానే ఉంది. మదనపల్లె పుంగనూరు రోడ్డులోని డీఎస్పీ బంగ్లా ఎదురుగా, సీటీయం మార్గంలోని దేవతానగర్ వద్ద అక్కడక్కడ తారు లేచిపోయి కంకరతేలి గుంతలు ఏర్పడ్డాయి. అధికారులు చొరవ తీసుకుని ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాల్సి ఉంది.

పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం ; దెబ్బతిన్న రోడ్లను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ప్యాచ్‌వర్కులకు ప్రతిపాదనలు పంపుతాం. ప్రస్తుతం తాత్కాలిక పనులు మంజూరయ్యాయి. పనులు చేపట్టాల్సి ఉంది. దీనిపై చర్యలు తీసుకుంటాం.

- బూరయ్య, ఏఈ, రోడ్లు, భవనాలశాఖ, మదనపల్లె


బురదమయంగా మారిన నిమ్మనపల్లె దారి


గుంతలమయంగా పొన్నూటిపాళ్యం రోడ్డు

చెరువు కట్ట పరిశీలన


చెరువు కట్టను పరిశీలిస్తున్న తహసీల్దార్, నీటిపారుదల అధికారులు

రామాపురం, న్యూస్‌టుడే: మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ సుగాలిబిడికి సమీపంలోని గుండ్ల చెరువు కట్ట రంధ్రం పడడంతో శుక్రవారం తహసీల్దార్ రామాంజనేయులు పరిశీలించారు. ఎగువ పాలకొండల్లో వర్షాలు అధికంగా కురవడంతో ఆ వర్షపు నీరంత గుండ్ల చెరువుకు చేరుతుండడంతో చెరువు కట్టను పరిశీలించి జేసీబీ. ట్రాక్టర్లతో మట్టితో పూడ్చేలా చర్యలు తీసుకున్నారు. నీటి పారుదల అధికారులతో కలిసి చెరువు కట్టను పటిష్ఠ పరచాలని సూచించారు. అటవీ ప్రాంతంలో వాగులు పారుతుండడంతో అప్రమత్తంగా ఉంటామని ఆయన తెలిపారు.

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

సమస్యల సాధనకు పోరాటం


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

రాజంపేట : విద్యుత్తు ఒప్పంద కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు సి.రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక ర.భ.శాఖ అతిథిగృహం వద్ద శుక్రవారం యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒప్పంద, పొరుగు సేవల కార్మికులకు చట్టబద్ధంగా కల్పించాల్సిన ఈపీఎఫ్ గత 12 నెలలుగా జమ కాలేదన్నారు. ఈఎస్ఐ జమకాకపోవడంతో కార్మికులు, వారి కుటుంబాలకు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకునే అవకాశం లేదన్నారు. సమస్యల సాధన కోసం దశలవారీగా పోరాటాలు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు.

స్పందనకు వందనం

ప్రభుత్వ భూముల పరిరక్షణకు చర్యలు

ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడుతామని తహసీల్దారు భాగ్యలత పేర్కొన్నారు. మండల కేంద్రం పరిధిలోని ప్రభుత్వ భూములను శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూముల పత్రాలను తనిఖీ చేశారు. భూముల వివరాలను ఆర్ఐ బాలాజీని అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ భూముల ఆక్రమణపై 'ఈనాడు'లో శుక్రవారం 'యథేచ్ఛగా ప్రభుత్వ భూముల కబ్జా' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన తహసీల్దారు భాగ్యలత భూములను పరిశీలించారు.

ఆర్టీసీ బస్టాండులో నీటి మళ్లింపు

గాలివీడు ఆర్టీసీ బస్టాండు ఆవరణలో బస్సులు నిలిచేస్థలంలో నిల్వ ఉన్న నీటిని రోడ్డు కాలువకు మళ్లించారు. ఇక్కడున్న సమస్యపై శుక్రవారం 'బస్సు ఎక్కాలంటే అడుసు తొక్కాల్సిందే!' అనే శీర్షికన చిత్రకథనం ఈనాడులో ప్రచురితమైంది. స్పందించి వర్షపు నీటిని కాలువకు మళ్లించారు. - న్యూస్‌టుడే, గాలివీడు

అద్దె భవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు!

గత వైకాపా పాలనలో ఒక్క భవనం నిర్మించని వైనం

రాజంపేట(గ్రామీణ, న్యూస్‌టుడే : ప్రజావసరాలను తీర్చే ప్రభుత్వ అధికారులు కొలువై ఉండే ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో అధ్వాన పరిస్థితులు నడుమ కొనసాగుతున్నాయి. ఉద్యోగులకు నిలువ నీడ కరవైంది, ఏళ్లు గడుస్తున్నా సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో ఇరుకు గదుల్లోనే కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీంతో ఏ ప్రభుత్వ కార్యాలయం ఎక్కడ ఉందో తెలియక ప్రజలు నానా తిప్పలు పడుతున్నారు. గత వైకాపా పాలనలో రాజంపేటలో కేంద్రీయ విద్యాలయం, ప్రభుత్వ ఐటీఐ, డీఎస్పీ కార్యాలయం, మన్నూరు పోలీసు స్టేషన్‌లకు సొంత భవనాలు నిర్మించడంలో అప్పటి ప్రభుత్వం విఫలం కావడంతో ప్రస్తుతం అద్దె భవనాలలో ప్రజలకు సేవలందిస్తున్నారు.

- రాజంపేట డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల ప్రజల కోసం డీఎస్పీ కార్యాలయం ఏర్పాటు చేసినా సొంత కార్యాలయం లేక అద్దె భవనంలో కొనసాగుతోంది. మొదటగా ఓ అద్దె ఇంట్లో కొనసాగింది తర్వాత డీసీసీబీకి చెందిన భవనంలోకి మారింది. చివరికి ఉద్యాన శాఖ కార్యాలయానికి చేరుకుంది. ఇది రాజంపేటకు పట్టణానికి నాలుగు కి.మీ దూరం ఉండడంతో అక్కడికి వెళ్లడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- రాజంపేట ఎంపీ, ఎమ్మెల్యేల నియోజకవర్గాలు కావడంతో ఈ పోలీసుస్టేషన్‌ను అప్‌గ్రేడ్‌గా మార్చి ఎస్సైకి బదులుగా సీఐని ఏర్పాటు చేశారు. పోలీసుల క్వార్టర్స్‌ను మన్నూరు, రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్లుగా మార్పు చేశారు.
- పేద విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం 2009లో రాజంపేటలో ప్రారంభించారు. అప్పటి నుంచి ప్రభుత్వాలు మారినా శాశ్వత భవనాలు మాత్రం నిర్మించలేదు. దీంతో అప్పటి నుంచి అద్దెభవనంలో శిక్షణ ఇస్తున్నారు. ఈ కళాశాలలో దాదాపు 180 మంది విద్యార్థులు చదువుతున్నారు. అద్దె భవనంలో సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు ఉన్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. వీరికి చదువుతో పాటు ప్రాక్టికల్స్ కోసం యంత్రాలు, పరికరాలు ఏర్పాటు చేయడానికి స్థలం లేకపోవడంతో నామమాత్రంగా ప్రాక్టికల్స్ చేయిస్తున్నారు. ఈ ఇంటికి అద్దె రూపంలో నెలకు రూ.35 వేలు చెల్లిస్తున్నారు.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు దేశ వ్యాప్తంగా ప్రతి ఎంపీ నియోజకవర్గానికి ఒక కేంద్రీయ విద్యాలయం మంజూరు చేశారు. ఈ విద్యాలయానికి సొంత భవనం లేకపోవడంతో బీసీ వసతి గృహంలో తాత్కాలిక తరగతి గదులను ఏర్పాటు చేశారు. సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు ఇంటర్ చదువుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం పోలి వద్ద దాదాపు తొమ్మిది ఎకరాలు స్థలం కేటాయించినా ఇంత వరకు నిర్మాణ పనులు జరగలేదు. కేంద్ర ప్రభుత్వం కూడా కేంద్రీయ విద్యాలయం కోసం రూ.18.56 కోట్లు కేటాయించినా ఇక్కడి అధికారులు పట్టించుకోకపోవడంతో సొంత భవనాల నిర్మాణం జరగలేదు. ఇప్పటికైనా కేంద్రీయ విద్యాలయం ఛైర్మన్‌గా ఉన్న జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని ఇక్కడ విద్యార్థి తల్లిదండ్రులు కోరుతున్నారు.



అద్దె భవనంలో రాజంపేట మన్నూరు పోలీసు స్టేషన్


రాజంపేట మండలం సరస్వతీపురం వద్ద బీసీ వసతి గృహంలో కొనసాగుతున్న కేంద్రీయ విద్యాలయం

పెట్రోలు బంకులో కల్తీ!


సీసా అడుగుభాగంలో పెట్రోలు కింద నీరు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని ఓ పెట్రోలు బంకులో నీరు కలుపుతున్నారంటూ శుక్రవారం వినియోగదారులు ఆరోపించారు. ద్విచక్ర వాహనాలకు పెట్రోలు పట్టించుకోగా అందులో నీరు కలిసినందున వాహనాలు ఆగిపోయాయన్నారు. సుమారు 60 నుంచి 70 వాహనాలకు ఈ పరిస్థితి ఎదురవడంతో వారు యాజమాన్యంతో గొడవ పడ్డారు. పెట్రోలు నిల్వ చేసే ట్యాంకుల్లోకి వర్షపు నీరు చేరడంతో సమస్య వచ్చిందని యాజమాన్యం బంకును తాత్కాలికంగా మూసివేశారు. పెట్రోలు కల్తీతో దెబ్బతిన్న వాహనాలను సరి చేయాలంటే ఒక్కో వాహనానికి రూ.వేలు ఖర్చవుతుందని, అధికారులు జోక్యం చేసుకుని తమకు పరిహారం ఇప్పించాలంటూ వారు డిమాండు చేశారు.

శనేశ్వరస్వామి ఆలయంలో చోరీ


ఆలయం వద్ద పరిశీలిస్తున్న మన్నూరు సీఐ రామాంజనేయులు

రాజంపేట (గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం పోలి చెరువు వద్ద ఉన్న శనేశ్వరస్వామి ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు స్వామి హుండీని ధ్వంసం చేసి అందులోని నగదును, స్వామి వారి పంచలోహ విగ్రహాలను తీసుకెళ్లినట్లు ఆలయ ధర్మకర్త సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న మన్నూరు పోలీసులు ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ ధర్మకర్తలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని మన్నూరు సీఐ రామాంజనేయులు తెలిపారు.

ఎద్దుల బండిని ఢీకొన్న మినీ బస్సు

రాజంపేట (గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం తాళ్లపాక సిద్దులపల్లి గ్రామానికి చెందిన సాంబశివరాజు రాజంపేటకు ఎద్దుల బండిపై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మినీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో సాంబశివరాజు, రెండు ఎద్దులు గాయపడ్డాయి. ఎద్దుల బండి పూర్తిగా ధ్వంసమైంది. గాయపడిన వ్యక్తిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు మన్నూరు సీఐ రామాంజనేయులు తెలిపారు.

మారెమ్మకు ప్రత్యేక పూజలు


పుల్లంపేటలో కొలువుదీరిన మారెమ్మ

పుల్లంపేట, న్యూస్‌టుడే: ప్రతి శుక్రవారం దాతల సహకారంతో అన్నదానం చేపడుతున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేపట్టారు. దాత మల్లికార్జున ఆర్థిక సహకారంతో రెండువందల మందికి అన్నదానం చేపట్టినట్లు వారు తెలిపారు.

పింఛలో తగ్గిన ప్రవాహం

సుండుపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వై.ఆదినారాయణరెడ్డి పింఛ జలాశయంలోకి వస్తున్న నీటి ప్రవాహం తగ్గింది. శుక్రవారం 90 క్యూసెక్కులకు చేరింది. జలాశయంలో సాయంత్రానికి 978.4 అడుగుల వద్దకు చేరిందని సిబ్బంది తెలిపారు.

గోడపత్రాల ఆవిష్కరణ

సుండుపల్లి, న్యూస్‌టుడే : మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా అవగాహన గోడపత్రాలను ఎమ్మార్వో కార్యాలయంలో తహసీల్దారు ఎ.వైజయంతి శుక్రవారం ఆవిష్కరించారు. మండలపరిషత్ కార్యాలయంలో నిశ్శబ్ద నడక టీషర్టులను ఎంపీడీవో జనార్దనరెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంఈవో-2 రవీంద్రనాయక్, గుడ్‌విల్ ఆఫ్ సిలోమ్ ప్రతినిధి నాగేశ్వరావు, ఈవోఆర్డీ సురేష్‌బాబు, డీటీ రెడ్డెన్న, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వే భూ సమస్యలు పరిష్కరిస్తాం

ప్యారంపల్లె(గాలివీడు), న్యూస్‌టుడే: రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దారు భాగ్యలత పేర్కొన్నారు. ప్యారంపల్లె గ్రామంలో శుక్రవారం రీ సర్వేలో వచ్చిన సమస్యల పరిష్కారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ.. భూముల రీ సర్వేలో ఏర్పడిన సమస్యలను తప్పకుండా పరిష్కరించేందుకు గ్రామ స్థాయిలో సభలు నిర్వహించి పట్టాదారు పాసు పుస్తకాల బాధితుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. సమస్యలను పరిష్కరించాలని బాధిత రైతులు వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో డివిజన్, మండల, గ్రామ సర్వేయర్లు, వీఆర్వోలు, మాజీ ఎంపీపీ ఆవుల వెంకటనారాయణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.


రైతు నుంచి అర్జీ స్వీకరిస్తున్న తహసీల్దారు భాగ్యలత

దెబ్బతిన్న పంటల పరిశీలన


హత్యరాలలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాజంపేట మండలం మందరం, హత్యరాల, పోలి, మదనగోపాలపురం, తాళ్లపాక గ్రామాల్లో తుపాను ప్రభావంతో నేలకు వాలిన వరి పంటను జిల్లా వ్యవసాయాధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రైతులు ఎక్కువగా యూరియా వాడకంతో పైరు ఎక్కువ పెరిగిందని, దీంతో పంట నేలకు పడిపోయిందని చెప్పారు. నేలకు ఒరిగిన వరి ధాన్యం మొలకలు రాకుండా ఉండాలంటే రైతులు సకాలంలో ఉప్పు నీటిని పడిపోయిన వరి ధాన్యంపై పిచికారీ చేయాలని సూచించారు. అదే విధంగా పొలంలో నీరు లేకుండా చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏవో రామకృష్ణంరాజు, సుచిత్ర, మాధురి, మాహాలక్ష్మీ, రాజంపేట ఏవో రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు వ్యవసాయాధికారుల సూచనలు


నందలూరు : నందలూరు మండల పరిధిలో గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెబ్బతిన్న పంటలను శుక్రవారం జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారులు రామకృష్ణమరాజు, సుచిత్ర, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త సాయి మహేశ్వరి, మాధురిలు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారులు మల్లికార్జున, పుష్పాంజలి, రైతులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

పుల్లంపేట, న్యూస్‌టుడే: మండలాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీడీవో జయశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం పుల్లంపేట మండల పరిధిలోని రెడ్డిపల్లె, రామసముద్రం పంచాయతీలలో రూ.20 లక్షలతో సీసీ రోడ్లకు ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి సమస్యను గుర్తించి పరిష్కారానికి ప్రభుత్వం అడుగులు వేస్తోందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌నాయుడు, నాయకులు సాయివికాష్‌రెడ్డి, వెంకటరమణ, వెంకటయ్య జనసేన నాయకులు రమణ తదితరులు పాల్గొన్నారు.


రామసముద్రంలో భూమిపూజ చేస్తున్న ఎంపీడీవో జయశ్రీ

అక్రమాలకు పాల్పడితే చర్యలు


చిట్వేలిలో దుకాణంలో తనిఖీ చేస్తున్న తూనికల కొలతల అధికారి నాగరాజు

చిట్వేలి(పుల్లంపేట), న్యూస్‌టుడే: కొలతలు, బరువులలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పదని తూనిక కొలతల అధికారి నాగరాజు పేర్కొన్నారు. చిట్వేలి లోని పలు దుకాణాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఒక దుకాణంలో 25 కిలోలు ఉండాల్సిన బియ్యం బస్తా 23 కిలోలే చూపించగా, మరో దుకాణంలో ఎమ్మార్పీ దరలు లేకుండానే విక్రయిస్తున్నట్లు తనిఖీలో తేలిందని తెలిపారు. దుకాణానికి ఐదువేలు చొప్పున జరిమానా విధించినట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి బీమా అందజేత

పుల్లంపేట, న్యూస్‌టుడే: పుల్లంపేట మండలం రెడ్డిపల్లె చంగల్‌రెడ్డి మృతి చెందారు. ఈయన ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా చేయడంతో ఆయన కుటుంబానికి రూ.రెండు లక్షల బీమాను అందించినట్లు ఏపీజీబీ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక బ్యాంకులో చంగల్‌రెడ్డి భార్య రాణెమ్మకు చెక్కు అందించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో అంతరాయం నేడు

పెనగలూరు, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ షఫీ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు సరఫరా ఉండదని చెప్పారు. సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

రాయచోటి, సుండుపల్లి, న్యూస్‌టుడే : సుండుపల్లి మండలం పెద్దినేనికాలువ గ్రామం బెస్తపల్లిలో నివాసం ఉన్న వివాహిత లక్ష్మి శుక్రవారం ఇంటిలో పెట్రోలు పోసుకుని నిప్పంటించుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఘటనలో తీవ్రగాయాలైన ఆమెను 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండడంతో సమాచారం అందుకున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి అసిఫా సుల్తానా ఆసుపత్రికి వచ్చి వాంగ్మూలం తీసుకున్నారు. ఎస్సై శ్రీనివాసులు విచారించి కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. తెలంగాణ రాష్ట్రం మహబూబ్‌నగర్‌కు చెందిన గోవిందు. లక్ష్మిల దంపతులు రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చారు. సుండుపల్లి మండల పరిధిలోని రాళ్లుకొట్టే పనులు చేస్తూ బెస్తపల్లెలో అద్దె ఇంటిలో నివాసముంటున్నారు. వీరికి మూడేళ్లు, పదినెలల వయసున్న ఇద్దరు ఆడపిల్లలున్నారు. ఘటన గురించి తెలుసుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్, సుండుపల్లి ఎస్సై శ్రీనివాసులు ఆసుపత్రికి వెళ్లి విచారించారు. లక్ష్మిపరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతదేహం వెలికితీత

వీరబల్లి, న్యూస్‌టుడే: మండలంలోని సి.టి.కె హరిజనవాడకు చెందిన సుధాకర్ అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆలస్యంగా అతని మృతిపై కేసు నమోదు చేశారు. దీంతో శుక్రవారం ఎస్సై మోహన్‌నాయక్, తహసీల్దారు శ్రావణి, సిబ్బంది, వైద్యాధికారి మహేశ్వర్‌రాజులు హరిజనవాడ సమీపంలో పూడ్చిన శవాన్ని వెలికితీసి పోస్టుమార్టం చేశారు. పోస్టుమార్టం నివేదిక అనంతరం కేసులోని నిందితులను అరెస్టు చేస్తామని వివరించారు.

పీహెచ్‌డీ ప్రదానం


నాగస్వరూప

రాజంపేట, న్యూస్‌టుడే : ఏఐటీఎస్ యూనివర్సిటీ సీఎస్ఈ విభాగంలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న సి.నాగస్వరూప జేఎస్ విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీని అందుకున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవీ నారాయణ తెలిపారు. 'అప్టిమైజింగ్ అల్గోరిథమ్స్ టు ఇంటిగ్రేట్ అడ్వాన్స్‌డ్ మెషిన్ లెర్నింగ్ మెథడ్స్ ఫర్ ప్రెడిక్టివ్ మెయింటెనెన్స్ ఇన్ ఇండస్ట్రియల్' అనే అంశంపై ఆగ్రా సీఎస్ఈ జేఎస్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్ పర్యవేక్షణలో పరిశోధన చేసి పత్రాన్ని సమర్పించినందుకు ఈ పీహెచ్‌డీని అందుకున్నట్లు నాగస్వరూప పేర్కొన్నారు. కళాశాల యాజమాన్యం ఆమెను అభినందించారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

చిన్నమండెం, న్యూస్‌టుడే : కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చాకిబండ ప్రాథమిక వైద్య ఆరోగ్య వైద్యుడు రియాజ్‌బేగ్ సూచించారు. మండల పరిధిలోని చాకిబండ గ్రామం అంబాబత్తినవాండ్లపల్లెలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు చికిత్సలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం జ్వరాలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో సంపత్, ప్రతిభాకుమారి, వెంకటయ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

సొంత ఆదాయ వనరులపై దృష్టి సారించాలి


సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌పీవో లక్ష్మీపతి


సుండుపల్లి : హాజరైన ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, తదితరులు

లక్కిరెడ్డిపల్లె, న్యూస్‌టుడే: సొంత ఆదాయ వనరులపై పంచాయతీలు ప్రత్యేక దృష్టి సారించి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని డీఎల్‌పీవో లక్ష్మీపతి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ రాజ్ చట్టం 1994 ప్రకారం గ్రామాల అభివృద్ధి పంచాయతీలే కీలక పాత్ర పోషించాలన్నారు. పారిశుద్ధ్యం, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణపై నిఘా పెట్టాలన్నారు. అలాగే తాగునీటి సరఫరా, వీధిదీపాలు, సిమెంటు రోడ్ల ఏర్పాట్లపై చొరవ చూపించాలని సూచించారు. ముఖ్యమైన వనరులకు కమిటీల ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో రెడ్డెయ్య, ఉషారాణి, సుదర్శన్‌రెడ్డి, నాగమణి, ఇమామ్‌సాహేబ్, తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు విధులు, బాధ్యతలు తెలిసి ఉండాలని ఎంపీడీవో పోతుగుంట జయశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచలయ్య, ఎస్‌వో శ్రీధర్‌రెడ్డి, శిక్షకులు వేమయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల క్రియాశీలతతోనే ప్రగతి

సుండుపల్లి: వార్డు సభ్యులు క్రియాశీలంగా పని చేస్తేనే గ్రామాల ప్రగతి సాధ్యమని ఎంపీడీవో సుధాకరరెడ్డి, ఈవోపీఆర్డీ సురేష్‌బాబులు పేర్కొన్నారు. మండలపరిషత్తు సభాభవనంలో శుక్రవారం ఉప సర్పంచులు, ఇద్దరు వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ప్రారంభించారు. పంచాయతీల పరిధిలో సొంత ఆదాయ వనరులు సమకూర్చుకుంటే అభివృద్ధి సాధ్యం అవుతుందని వివరించారు. పంచాయతీ ఆదాయ వ్యయాలు, వచ్చిన నిధుల సద్వినియోగం తదితర అంశాలపై క్రియాశీలంగా ఉండాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులకు అందేలా చూడాలన్నారు. శిక్షణా కార్యక్రమానికి రాయవరం సర్పంచి మహమ్మద్ షరీఫ్ హాజరయ్యారు.

ఇదేనా అప్రమత్తత?



వర్షాల నేపథ్యంలో వాగులు, చెరువులు, నదుల వద్ద జాగ్రత్తలు పాటించాలని అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేస్తోంది. భారీ వర్షం కురిసి వంకలు పరవళ్లు తొక్కుతూ ప్రవహించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో వంతెనల వద్ద ప్రవాహాలకు అడ్డుగా ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది. కానీ ఆ దిశగా ఎవరూ దృష్టి సారించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సుండుపల్లి-రాయవరం ప్రధాన రహదారిలో ఈదల వంక వంతెన వద్ద తూములలో నీటి ప్రవాహం సాగేందుకు వీలు లేకుండా మొక్కలు, గడ్డి ఏపుగా పెరిగాయి. దీంతో ఎగువ ఉన్న నివాస ప్రాంతాలలోకి నీరు వెళ్లడం, రహదారిపై పొర్లి కోతకు గురయ్యే ప్రమాదం ఉంది. అధికార యంత్రాంగం దీనిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సుండుపల్లి

తాగునీటి సమస్య పరిష్కారం

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే : కలెక్టర్ చొరవతో రాజంపేట మండలం శేషమాంబపురం ప్రజల తాగునీటి సమస్య తీరింది. గ్రామంలో నాలుగు రోజులుగా తాగునీరు సరఫరా లేకపోవడంతో వ్యవసాయ పొలాలు వద్ద ప్రజలు నీటిని తెచ్చుకుంటున్నారు. ఈ విషయమై గ్రామస్థులు శుక్రవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో సమస్య పరిష్కరించాలని కలెక్టర్ మండల అధికారులను ఆదేశించారు. స్పందించిన అధికారులు చెయ్యేరులో మంచి నీటి బోరు వేసి నీటి వసతిని కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వరప్రసాద్, ఈవోపీఆర్డీ హరిప్రసాద్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజేష్‌లు గ్రామ సభ నిర్వహించి ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలోని ఆసాదివాండ్లపల్లిలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచి నాగార్జునాచారి చొరవ చూపి సత్వరం పరిష్కరించారు. గ్రామస్థులు అడిగిన తక్షణం శుక్రవారం బోరు ఏర్పాటు చేయించి నీరు పడడంతో మోటారు అమర్చి నీటి సమస్య తీర్చారు. గ్రామంలో ఎక్కడా నీటి సమస్య ఉండకూడదనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు సర్పంచి తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంలో రాణించాలి

గాలివీడు, న్యూస్‌టుడే: ప్రకృతి వ్యవసాయంలో మెలికలు తెలుసుకుని మహిళలు రాణించాలని గాలివీడు గ్రామ సర్పంచి లక్ష్మిదేవి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం రెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ మహిళా రైతు దినోత్సవాన్ని పురస్కరించుకుని సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. అనంతరం సంస్థ అధ్యక్షురాలు భానుజా మాట్లాడుతూ ఎఫ్‌పీవోలో ప్రతి మహిళ సభ్యురాలై ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నారు. మహిళల హక్కులు, చట్టాలపై చర్చించారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రీడ్స్ సంస్థ అధ్యక్షుడు ముదిగుబ్బ శ్రీనివాసులు, సమన్వయకర్తలు రవీంద్ర, భారతి, స్వాతి, వెంకటయ్య, యల్లప్ప, ఎస్వీరమణ, వెలుగు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.